

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 05 జూన్ 2021 | సంపుటి : 02 | సంచిక :319 | పేజీలు : 4 | వెల : రూ 3-00

## నిషేదిత పొగాకు ఉత్పత్తులు పట్టుకొన్న బసంత్ నగర్ పోలీసులు

పెద్దపల్లి జూన్ 04 రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్ కేంద్రంలోని బిసి కాలనీలో నిషేదిత పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు బసంత్ నగర్ ఎస్ఐ మహేందర్ కుమార్, సిబ్బంది శ్ తో కలిసి దాడులు నిర్వహించారు. బిసి కాలనీ మందల సంపత్ రెడ్డి ఇంట్లో తనిఖీ నిర్వహించగా రూ.5000 విలువ గల ప్రభుత్వ నిషేదిత పొగాకు ఉత్పత్తులు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని మందల సంపత్ రెడ్డిని అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం బసంత్ పోలీస్ స్టేషన్ లో తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## తాడిపత్రిలో కోవిడ్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం జగన్




అమరావతి/అనంతపురం: తాడిపత్రిలో 500 పడకల కోవిడ్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తన క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని అర్జాస్ స్టీల్ వద్ద ఏర్పాటు 500 ఆక్సిజన్ పడకల జర్మన్ హ్యాంగర్ల ఆస్పత్రిని నిర్మించారు. సీఎం జగన్ ఆదేశాలతో 15 రోజుల్లో 13.56 ఎకరాల్లో రూ.5.50 కోట్లతో కోవిడ్ ఆస్పత్రిని నిర్మించారు.“ కోవిడ్ టైంలో, ఆక్సిజన్ కెపాసిటీలు కొంచెం కష్టంగా ఉన్న సమయంలో అర్జాస్ స్టీల్‌కు ఎయిర్ సపరేషన్ ప్లాంట్ ఉండటం, అక్కడి నుంచి వారి ప్లాంట్ కెపాసిటీ మేరకు దాదాపు రోజుకు 100 టన్నుల లిక్విడ్ ఆక్సీజన్ కెపాసిటీ ఉండడం, వారిని ఉపయోగించుకుని జర్మన్ హ్యాంగర్‌లతో ఈ ఆసుపత్రిని ఏర్పాటుచేయడం నిజంగా గర్వించదగినది. అందరూ బాగా పనిచేశారు. పేరుపేరునా అందరికీ అభినందనలు. అర్జాస్ స్టీల్స్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తికి ప్రత్యేక అభినందనలు. ఈ కష్టకాలంలో మీరు చేసిన సాయం మరువలేనిది” అని అన్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని), పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ వి.విజయరామరాజు ఇతర ఉన్నతాధికారులు హాజరుకాగా తాడిపత్రి నుంచి రోడ్లు, భవనాలశాఖ మంత్రి శంకర నారాయణ, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్ పూర్తి బాధ్యత కేంద్రమే తీసుకోవాలి: సీఎం జగన్

ఈ విషయంలో సీఎంలంతా ఒక మాట మీదే ఉండాలి

అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాసిన ముఖ్యమంత్రి జగన్

కేంద్రం చేతుల్లో మాత్రమే వ్యాక్సిన్ల కొనుగోలుకు అనుమతి ఇచ్చే అధికారం

దీంతో మా రాష్ట్రం పిలిచిన గ్లోబల్ టెండర్లకు స్పందన రాలేదు

మిగతా రాష్ట్రాల టెండర్లదీ ఇదే పరిస్థితి

వ్యాక్సిన్ ప్రక్రియ ఆలస్యం అయ్యే కొద్దీ ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది

సంక్షోభం నుంచి దేశాన్ని గట్టెక్కించడానికి మనమంతా ఏకతాటిపై ఉండాలి



అమరావతి: కోవిడ్?19 కట్టడిలో కీలకమైన వ్యాక్సినేషన్ ప్రక్రియను రాష్ట్రాల సమన్వయంతో పూర్తిగా కేంద్రమే నిర్వహించాలని, ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే మాట మీద నిలబడదామంటూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని పలువురు ముఖ్యమంత్రులకు గురువారం లేఖలు రాశారు. ‘అంతర్జాతీ య టెండర్ల ద్వారా వ్యాక్సిన్ కొనుగోలు చేసి, రాష్ట్రంలో ఉచితంగా వ్యాక్సిన్ అందిద్దామన్నా, దీనికి అనుమతులు కేంద్ర మే ఇవ్వాల్సి ఉండటంతో అంతర్జాతీయ సంస్థలు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితిలో వ్యాక్సినేషన్ బాధ్యత పూర్తిగా కేంద్రమే తీసుకోవాలని అందరం ఏకమై అడుగుదాం’ అని ఆ లేఖల్లో పేర్కొన్నారు. దేశంలోని పలువురు ముఖ్యమంత్రులకు ఆయన రాసిన లేఖల్లో భాగంగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు రాసిన లేఖ ఇదీ.. మీరు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని భావిస్తున్నా. భయంకరమైన కరోనా వైరస్ ఇన్‌ఫెక్షన్ సెకండ్ వేవ్ నుంచి భారతదేశం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందన్న ప్రాథమిక సంకేతాలు అందుతున్నాయి. అయినా కోవిడ్ కట్టడి చర్యలను అప్పుడే ఆపివేయలేం. మీ రాష్ట్రంలో బలమైన ఆరోగ్య వ్యవస్థతో తదుపరి ప్రయాణానికి సిద్ధమవుతున్నారని భావిస్తున్నా. కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో మన పదునైన ఆయుధం వ్యాక్సిన్ మాత్రమే. ఇండియాలో వ్యాక్సినేషన్ ప్రక్రియ ఇంకా వేగవంతం కావాల్సిన అవసరం ఉందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. వాస్తవిక విషయాలు చూసిన తర్వాత నేను మీకు లేఖ రాస్తున్నా.రాష్ట్రంలోని ప్రజలందరికీ వ్యాక్సిన్ ఉచితంగా ఇవ్వాలన్న లక్ష్యంలో భాగంగా నేరుగా వ్యాక్సిన్ కొనుగోలు చేయడానికి అంతర్జాతీయ టెండర్లకు వెళ్లాం. జూన్ 3 సాయంత్రం 5 గంటల వరకు బిడ్లు సమర్పించడానికి గడువు ఇచ్చినా ఒక్కరు కూడా బిడ్లు దాఖలు చేయకపోవడం నిరాశ పరిచింది. వ్యాక్సిన్ కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్రాల చేతిలో ఏమీలేదు. వ్యాక్సిన్ల కొనుగోలు ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాల మధ్య అంశంగా మారడం, వ్యాక్సిన్ కొనుగోలుకు ఆమోదం తెలిపే అధికారం కేంద్రం చేతిలో ఉండటం ఈ పరిస్థితికి కారణాలుగా కనిపిస్తున్నాయి. దీంతోపాటు వ్యాక్సినేషన్ ప్రక్రియ అనేక సమన్వయ అంశాలతో ముడిపడి ఉంది. కొన్ని రాష్ట్రాలు మాకు తగినంత వ్యాక్సిన్ సరఫరా లేదని భావిస్తున్నాయి. గ్లోబల్ టెండర్లకు వెళుతున్న రాష్ట్రాలకు సరైన స్పందన కూడా రావడం లేదు. వ్యాక్సినేషన్ ప్రక్రియ ఆలస్యం అయ్యే కొద్ది ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. నేను అందరి ముఖ్యమంత్రులను కోరేది ఒక్కటే.. వ్యాక్సినేషన్ బాధ్యతను పూర్తిగా కేంద్రమే చేపట్టాలని ఒకే మాటగా వినిపిద్దాం. ప్రారంభంలో కేంద్రమే వ్యాక్సినేషన్ పూర్తి బాధ్యత తీసుకున్న విషయం మీకు తెలిసిందే. ఆరోగ్య సిబ్బందికి సరైన సమయంలో వ్యాక్సినేషన్ చేయడం మంచి ఫలితాలను ఇచ్చింది. ఫ్రంట్‌లైన్ వర్కర్లు, ఆరోగ్య సిబ్బందికి ముందుగా వ్యాక్సిన్ ఇవ్వాలి అన్న నిర్ణయంతో సరైన సమయంలో వ్యాక్సినేషన్ పూర్తి చేయగలిగాం. తద్వారా కరోనా సెంకడ్ వేవ్ ఉధృతిలో కూడా వారు వైరస్‌తో పోరాడగలిగారు.

## జీన్స్, టీషర్ట్స్ వేసుకోవద్దు.. సీబీఐ అధికారులకు కొత్త డైరెక్టర్ ఆదేశాలు

న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేష్ (సీబీఐ) కొత్త డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైస్వాల్ తన అధికారులు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి జీన్స్, టీషర్ట్స్, స్పోర్ట్స్ షూలు వేసుకోకూడదని, హుందాగా కనిపించే ఫార్మల్ డ్రెస్సులే వేసుకోవాలని స్పష్టం చేశారు.




ఈ ఆదేశాల ప్రకారం సీబీఐలో పని చేసే పురుషులు షర్ట్స్, ఫార్మల్ ప్యాంట్లు, ఫార్మల్ షూస్ వేసుకోవాలి. ప్రతి రోజూ నీట్‌గా షేవ్ చేసుకోవాల్సిందే. ఇక మహిళా అధికారులైతే చీరలు, సూట్లు, ఫార్మల్ షర్ట్స్, ప్యాంట్లు మాత్రమే వేసుకోవాలి.ఆఫీస్‌లో జీన్స్, టీషర్ట్స్, స్పోర్ట్స్ షూస్, చెప్పులు, క్యాజువల్ వేర్ ఏదీ అనుమతించబోము అని ఆ ఆదేశాల్లో డైరెక్టర్ సుబోధ్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న సీబీఐ శాఖల హెడ్స్ కచ్చితంగా ఈ ఆదేశాలు అమలయ్యేలా చూడాలని కూడా అందులో తేల్చి చెప్పారు. నిజానికి ఎప్పటి నుంచో ఇలాంటి డ్రెస్సింగ్ సీబీఐలో ఉన్నా.. గత కొన్నేళ్లుగా కొందరు క్యాజువల్స్ వేసుకోవడం ప్రారంభించారని, అయితే ఇన్ని రోజులూ వారిని ఎవరూ ప్రశ్నించలేదని ఓ సీబీఐ అధికారి అన్నారు. ఈ ఆదేశాలు ఒకరకంగా మంచివేనని అభిప్రాయపడ్డారు. గత వారమే సీబీఐ 33వ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సుబోధ్.. రానున్న రోజుల్లో సీబీఐ పనితీరును మెరుగుపరిచేందుకు కొన్ని కీలక చర్యలు తీసుకోనున్నట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి.

## రూ.43000 కోట్లతో ఆరు సబ్‌మెరైన్ల నిర్మాణానికి ఆమోదం

న్యూఢిల్లీ: అత్యాధునిక సబ్‌మెరైన్లను నిర్మించేందుకు భారత్ సన్నద్ధమైంది. భారతీయ నేవీ కోసం ఆరు జలాంతర్గాములను నిర్మించేందుకు రక్షణశాఖ సుమారు రూ.43000 కోట్లు కేటాయించింది. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ భేటీలో సబ్‌మెరైన్ల ప్రాజెక్టుకు ఆమోదం దక్కింది. స్వదేశీయంగా సబ్‌మెరైన్లను నిర్మించేందుకు త్వరలోనే ప్రతిపాదలనలను జారీ చేయనున్నట్లు అధికార వర్గాల ద్వారా వెల్లడైందిమజగాన్ డాక్స్(ఎండీఎల్), లార్సెన్ అండ్ టర్బో(ఎల్అండ్‌టీ) సంస్థలకు రక్షణశాఖ ప్రతిపాదనల రిక్వెస్ట్ పంపింది. ప్రాజెక్ట్-75 ఇండియా కింద ఆరు డీజిల్-ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న స్కార్పీన్ క్లాస్ సబ్‌మెరైన్ల కన్నా పెద్ద సైజులో ఉండనున్నాయి.




జలాంతర్గాముల్లో అత్యంత శక్తివంతమైన ఆయుధాలను అమర్చనున్నారు. 12 ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైల్స్ ఉండనున్నాయి. యాంటీ షిప్ క్రూయిజ్ మిస్సైళ్లను కూడా వాడనున్నారు. సుమారు 18 హెవీవెయిట్ టార్పిడోలను మోసుకువెళ్లే విధంగా సబ్‌మెరైన్లు ఉండాలని ఇప్పటికే నేవీకి సూచనలు చేశారు. ప్రస్తుతం భారతీయ నేవీ వద్ద 12 సబ్‌మెరైన్లు ఉన్నాయి. దీంతో పాటు ఐఎన్ఎస్ హరిహంత్, ఐఎన్ఎస్ చక్ర లాంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు కూడా ఉన్నాయి.

## కారా మాస్టారు కన్నుమూత: సీఎం జగన్ సంతాపం

శ్రీకాకుళం: కారా మాస్టారుగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు కన్నుమూశారు. కథానిలయం వ్యవస్థాపకులు, కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత శ్రీకాకుళంలోని స్వగృహంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. దీంతో తెలుగు సాహితీలోకం తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. కథా సాహిత్యానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొంటూ రచయితలు, కవులు, కళాకారులు నివాళులర్పించారు. ఆయన లేని లోటు ఎన్నటికీ పూడ్చలేనిదంటూ పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కథకు చిరునామాగా, ‘కథానిలయం’ పేరుతో భావి తరాల కోసం సాహితీ సంపదను కాపాడిన సాహితీ మూర్తి కారా మాస్టారు అంటూ కొనియాడారు. 1924లో శ్రీకాకుళం జిల్లా మురపాకలో జన్మించారు కాళీపట్నం రామారావు. తన దైన శైలిలో రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన ఆయన వేలాది మంది శిష్యులు, అభిమానులను సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా 1964లో రాసిన యజ్ఞం కథ ఆయన విశేష ఖ్యాతిని తీసుకొచ్చింది. కథా రచయితగా తెలుగు రచనల ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత ఆయనది. ఫ్యూడల్ వ్యవస్థలోని దోపిడికి ‘యజ్ఞం’ అద్దంపడుతుంది. అందుకే ఈ రచన రష్యాలో అనువదింపబడి ప్రపంచ గుర్తింపు పొందింది.భావితరాలను దృష్టిపెట్టుకుని ఫిబ్రవరి 22, 1997లో శ్రీకాకుళంలో కథానిలయం స్థాపించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ద్వారా సమకూరిన డబ్బు, మరికొందరు సాహితీవేత్తల సహకారంతో 800 కథల పుస్తకాలతో ఆరంభమైన ఈ కథా నిలయం లక్ష పుస్తకాలతో అలరారుతుండటం విశేషం. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన సరళమైన రచన శైలితో వేలాది అభిమానులను ఆకట్టుకున్నారు. కుట్ర, రాగమయి, జీవధార, కారా కథలు, రుతుపవనాలు వంటి ఆయన రచనలూ ఆదరణ పొందాయి.

సీఎం జగన్ సంతాపం

సాహిత్య అకాడమీ గ్రహీత, కారా మాస్టారుగా పేరొందిన కాళీపట్నం రామారావు మృతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచారం వ్యక్తంచేశారు. చిన్న కథలతో, తనదైన కథా శైలితో ఆకట్టుకున్న ఉత్తరాంధ్రలోని సాహిత్యకారుల్లో ఆయన ప్రముఖుడని సీఎం గుర్తు చేశారు. కారా మాస్టారు కుటుంబ సభ్యులకు సీఎం వైఎస్ జగన్ తన సంతాపాన్ని తెలియజేశారు.



## కమలా హ్యారిస్ తో ఫోన్ లో మాట్లాడిన ప్రధాని మోదీ

ఢిల్లీ ,జూన్ 4: అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హ్యారిస్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫోన్ లో మాట్లాడారు. కోవిడ్-19టీకాల విషయంలో యుఎస్ అనుసరిస్తున్న “ప్రపంచవ్యాప్తంగా టీకా పంపిణీ వ్యూహంలో భాగంగా, భారతదేశంతో సహా ఇతర దేశాలకు అందుబాటు లోకి తెచ్చేందుకు యుఎస్ దగ్గరున్న ప్రణాళికలను గురించి ప్రధాన మంత్రితో కమలా హ్యారిస్ ఈ సందర్భంగా చర్చించారు.యుఎస్ తీసుకొన్న నిర్ణయానికి, అలాగే యుఎస్ ప్రభుత్వం వైపు నుంచి, వ్యాపారాల నుంచి, యుఎస్ లోని నిర్వాసితుల నుంచి ఇటీవలి కాలంలో భారతదేశానికి అందించిన సహకారానికి హ్యారిస్ కు ప్రధాన మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.కరోనా టీకా తయారీ రంగం సహా, యుఎస్ కు, భారతదేశానికి మధ్య సంబంధాలు బలపరచే దిశ లో ప్రస్తుతం సాగుతున్న ప్రయాసల ను గురించి వీరిద్దరూ చర్చించారు.



## ఏపీలో కొత్తగా 10,413 కరోనా కేసులు

అమరావతి: గడిచిన 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 85,311 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 10,413 కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అదే విధంగా, కరోనా కారణంగా 83 మంది మరణించారు. కాగా, గత 24 గంటల్లో ఈ మహమ్మారి బారినుండి 15,469 మంది కోలుకున్నారు. ఏపీలో ప్రస్తుతం 1,33,773 కేసులు ఆక్టివ్?గా ఉన్నాయి. ఇప్పటి వరకు ఏపీ రాష్ట్రంలో మొత్తంగా.. 15 లక్షల 93 వేల 921 మంది కరోనా నుండి కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు.ఇప్పటి వరకు ఏపీలో 1,96,19,590 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈమేరకు ఏపీ రాష్ట్రవైద్యారోగ్య శాఖ శుక్రవారం కరోనాపై హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది.

## చంద్రబాబు వ్యాక్సిన్ వేయించుకున్నారా? లేదా?

మంత్రి కురసాల కన్నబాబు ప్రశ్న

అమరావతి : రాష్ట్రంలో ఇల్లు లేని పేద వాడు ఉండకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తుంటే దాన్ని ఎలా అడ్డుకోవాలా అని ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. చంద్రబాబు హయంలో కేంద్రం ఇచ్చిన నిధులతో ఇళ్ల పథకానికి ఎన్‌టీఆర్ హౌసింగ్ అని పేరు పెట్టుకోలేదా?.. కేంద్రం నిధులు ఇవ్వకుండా రాష్ట్రాల్లో పథకాలు అమలవుతాయా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌ని కూడా కేంద్రం ఇచ్చే నిధులు, మనకు రావాల్సిన పన్నులు చూసుకునే తయారుచేస్తారని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. “ సీఎం కడుతుంది ఇల్లు కాదు.. ఊళ్లు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ఎంత ఖర్చు చేస్తున్నారో టీడీపీ వాళ్లకు తెలియదా?. ఆ స్థలాలు ఇవ్వకూడదని అడ్డుకుని కోర్టులో కేసులు వేసింది టీడీపీ వాళ్లు కాదా ?. చివరికి అమరావతిలో పేదలకు ఇళ్లు ఇస్తే డెమోగ్రాఫికల్ బ్యాలెన్స్ పోతుందని కోర్టుకు చెప్పింది మీరు కాదా?. సీఎం జగన్ ఇన్ని మంచి పనులు చేసి ప్రజలకు దగ్గరవుతున్నారని తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారు. వ్యాక్సిన్ విషయంలో ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్నారు.దేశంలో అత్యధికంగా వ్యాక్సినేషన్ చేసిన రాష్ట్రాల్లో మనం ముందున్నాం. వ్యాక్సిన్ సరఫరా కేంద్రం చేతుల్లో ఉన్న విషయం టీడీపీ వారికి తెలిసినా మాపై విమర్శలు చేస్తున్నారు. గ్లోబల్ టెండర్లతో వ్యాక్సిన్ సరఫరా పెంచి అందరికీ ఉచితంగా వ్యాక్సిన్ వేయాలనుకోవడం తప్పా?. కేంద్రం అనుమతి లేక గ్లోబల్ టెండర్లకు ఎవరూ రాలేదు. అందుకే కేంద్రమే దీనిపై చర్యలు తీసుకోవాలని సీఎం అన్నదాంట్లో తప్పేముంది.



# సంపాదకీయం

శనివారం 05 జూన్ 2021

## వ్యాక్సినేషన్ పై సుప్రీం తలంటులు

కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న కొవిడ్ 19 రెండవ విజృంభణను ఎదుర్కోడంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానంలోని లోపాలను సుప్రీంకోర్టు సూటిగా ఎత్తి చూపించింది. అయితే ఇది మొదటిసారి కాదు. డిజిటల్ అక్షరాస్యత అంతగా లేని దేశంలో ప్రత్యేకంగా కోవిన్ యాప్‌పై ఆధారపడి వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం సరికాదని పేర్కొంది. ప్రాథమిక హక్కు అయిన సమానత్వంతో పాటు ఆరోగ్య హక్కుపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొంది. ఇలాంటి విధానాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు వ్యాక్సినేషన్‌కి అడ్డంకిగా మారుతాయని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. పేదలు,అట్టడుగు వర్గాల ప్రజలు తమ స్నేహితుల సాయంతో ఆన్‌లైన్‌లో వ్యాక్సిన్ స్లాట్ బుక్ చేసుకుంటారన్న కేంద్రం వాదనను సుప్రీం తోసిపుచ్చింది. డిజిటల్ పరిజ్ఞానం ఉన్నవారే కోవిన్ యాప్‌లో వ్యాక్సిన్ స్లాట్ బుక్ చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. కోవిన్ యాప్ ద్వారా వ్యాక్సిన్ స్లాట్ బుక్ చేసుకునే అవకాశం అంధులకు లేదని తమ దృష్టికి వచ్చినట్లు సుప్రీం వ్యాఖ్యానించింది. అంధులకు కూడా యాక్సెస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. 18-44 ఏళ్ల మధ్యలోని అత్యధిక శాతం ప్రజలకు టీకాలు కొని వేయించే బాధ్యతను రాష్ట్రాల మీదికి నెట్టివేయడాన్ని, వ్యాక్సిన్లకు వేర్వేరు ధరలు నిర్ణయించడాన్ని అత్యున్నత న్యాయస్థానం మరోసారి గట్టిగా నిలదీసింది. ఇవే ప్రశ్నలను ఇదే ధర్మాసనం గతంలో రెండు సార్లు కేంద్రంపై ఎక్కుపెట్టింది. అయినా కేంద్ర పాలకుల్లో ఏ మాత్రం కదలిక, మార్పు రాకపోయే సరికి సోమవారం నాడు మరొక్కసారి ఉతికి ఆరేసిందని భావించాలి. బాలల ప్రాణాల మీదకు విరుచుకుపడనున్నదని భావిస్తున్న కొవిడ్ 19 మూడో కెరటాన్ని ఎదుర్కోడానికి ఎటువంటి సన్నాహాలు చేస్తున్నారని కేంద్రాన్ని ధర్మాసనం అడిగింది. 018 నాటి జాతీయ గణాంకాల ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 4 శాతం ఇళ్లు,పట్టణ ప్రాంతాల్లో కేవలం 23 శాతం ఇళ్లల్లోనే కంప్యూటర్స్ ఉన్నట్లు తెలిపింది. దేశంలో 15-19 ఏళ్ల వయసున్నవారిలో గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం మంది,పట్టణ ప్రాంతాల్లో 56శాతం మందికి మాత్రమే కంప్యూటర్ ఆపరేటింగ్ వచ్చునని తెలిపింది. దేశవ్యాప్తంగా కేవలం 24శాతం ఇళ్లకు మాత్రమే ఇంటర్నెట్ సదుపాయం ఉందని పేర్కొంది. దేశంలో 50 శాతం కన్నా తక్కువ మంది ప్రజలు వైర్ లెస్ డేటా సర్వీసులను ఉపయోగిస్తున్నట్లు తెలిపింది. ఈ గణాంకాలను గమనిస్తే గ్రామీణ ప్రాంతాలకు,పట్టణ ప్రాంతాలకు మధ్య డిజిటల్ యాక్సెస్ విషయంలో స్పష్టమైన తేడా కనిపిస్తోందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ లోపాలతోనే వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగిస్తే గ్రామీణ ప్రాంతాలపై,అట్టడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంది. కాబట్టి ఈ లోపాలపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పంజాబ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు టీకాల కోసం అంతర్జాతీయ టెండర్లను పిలుస్తున్నాయంటే దేశ పాలనా బాధ్యత వహిస్తున్న కేంద్రం తన కర్తవ్యాన్ని గుర్తించకపోడంగానే భావించవలసి వస్తుందని అభిప్రాయపడింది. దేశానికి అవసరమయ్యే టీకాలలో సగ భాగాన్ని ఒక్కొక్క డోసు రూ. 150 కే కేంద్రం కొంటున్నప్పుడు, రాష్ట్రాలు రూ. 300 నుంచి రూ. 600 వరకు చెల్లించుకోవలసి రావడం అక్రమమని వ్యాఖ్యానించింది. అంతేకాక రెండు దేశీయ టీకాలైన కొవిషీల్డ్, కొవాగ్జిన్లకు వేర్వేరు ధరలు నిర్ణయించడాన్నీ ప్రశ్నించింది. వ్యాక్సిన్ కంపెనీల మధ్య పోటీని పెంచడానికి, కొత్త కంపెనీలు రంగ ప్రవేశం చేయడానికి దోహదపడడం కోసమే రాష్ట్రాలకు టీకా కొనుగోలు బాధ్యతను అప్పజెప్పినట్టు కేంద్రం చెప్పిన కారణాన్ని తిరస్కరించింది. రాష్ట్రాల బాధ్యతగా వదిలిపెట్టిన 18-44 ఏళ్ల వయసు జనాభాలో బహుజనులు, నిరుపేదలూ, సమాజం అంచుల్లోని ఇతర బలహీన వర్గాలు ఉంటారని వారికి టీకాను కొనుక్కునే స్తోమత కూడా ఉండదని మే 30 వ తేదీన ఇదే ధర్మాసనం కేంద్రం దృష్టికి తీసుకు వచ్చింది. రాజ్యాంగం 21వ అధికరణ హామీ ఇస్తున్న ప్రజల జీవన హక్కును కాపాడాలంటే వ్యాక్సిన్ కంపెనీలతో కేంద్ర ప్రభుత్వమే నేరుగా ధరను మాట్లాడి తానే టీకాను కొని రాష్ట్రాలకు ఇవ్వాలని ధర్మాసనం అప్పుడు స్పష్టంగా సూచించింది. అయితే కేంద్ర ప్రభుత్వం మే 10వ తేదీ నాటి విచారణ సందర్భంగా తాను నిపుణులతో పలు సార్లు చర్చించి సలహాలు తీసుకున్న మీదటనే వ్యాక్సిన్ విధానాన్ని రూపొందించానని, ఈ రంగానికి సంబంధించిన నిపుణత కొరవడిన న్యాయ వ్యవస్థ ఇందులో జోక్యం చేసుకోడం తగదని పేర్కొంటూ ఒక అఫిడవిట్‌ను దాఖలు చేసింది. సోమవారం నాడు సుప్రీం ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ విధానంపై ప్రకటించిన తీవ్ర ఆగ్రహాన్ని గమనిస్తే దాని వివరణతో అది బొత్తిగా సంతృప్తి చెందలేదని బోధపడుతున్నది. టీకాలకు ఉత్పన్నమైన కనీవినీ ఎరుగని అత్యవసర డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్బంధ లైసెన్సింగ్ నిబంధనలను అమల్లోకి తేవాలని సుప్రీం ధర్మాసనం చేసిన సూచనను కూడా కేంద్రం ఇంతకు ముందు తిరస్కరించింది. దేశ జనాభాలో కేవలం 3.12 శాతం మందికే ఇంత వరకు టీకా రెండు డోసులు పూర్తి అయ్యాయి. అమెరికాలో 40 శాతం మంది, బ్రెజిల్ లో10 శాతం మంది, రష్యాలో 8.2 శాతం మంది టీకాలు వేయించుకున్నట్టు సమాచారం.

# టీడీపీలో 50 దాటేసిన వాళ్లే ఎక్కువ

విజయవాడ, జూన్ 4, (న్యూస్ పల్స్)వయసు పాదరసం లాంటిది. జారిపోతుంది. దాన్ని పట్టుకోలేరు కూడా. మరి అలాంటి వయసు ఎక్కడ మైనస్ అయినా రాజకీయాల్లో మాత్రం ఈ రోజు దాకా ప్లస్ గానే ఉంటోంది. ఎందుకంటే తలపండిన వారే ప్రజా ప్రతినిదులుగా నాయకులుగా రాణిస్తారు అని ఒక నమ్మకం తరాలుగా ఉంటూ వస్తోంది. కానీ ఇపుడు మాత్రం సీన్ మారుతోంది. ఏపీలో యువ ముఖ్యమంత్రిగా జగన్ రావడంతో పాటు ఆయన పార్టీ తరఫున గెలిచిన 151 మంది ఎమ్మెల్యేలలో వంద మంది దాకా యాభై ఏళ్ల లోపు వారు ఉండడంతో మిగిలిన పార్టీల మీద కూడా ఆ ప్రభావం గట్టిగా పడుతోంది. వైసీపీలో పోలిస్తే టీడీపీ వృద్ధ పార్టీలా తయారు అయింది. ఎటు చూసినా స్వీటి సిక్స్ టీ లీడర్లే కనిపిస్తున్నారు. దాంతో వారి చేత పరుగులు పెట్టించడం కష్టమైపోతోందిట. ఇక ఈనాటి జనాలకు కనెక్ట్ కావడం కూడా వారికి బహు ఇబ్బందిగా ఉంటోందిట. సోషల్ మీడియా యుగంలో జనాల బాడీ లాంగ్వేజ్ మాటల తీరు అన్నీ కూడా పూర్తిగా మారిపోయాయి. అయితే సీనియర్లు మాత్రం ఇంకా రొడ్డకొట్టుడు టైప్ తో రొటీన్ గానే కనిపించడమే టీడీపీకి అతి పెద్ద మైనస్ అని వ్యూహకర్తలు గుర్తించారుట. అర్జంటుగా అలాంటి వారిని తప్పించేయాల్సిందే అని కూడా సూచిన్నున్నారుట. దీంతో రేపటి ఎన్నికలలో వందకు వంద సీట్లూ కంప్లీట్ గా యూత్ కే ఇవ్వాలని చంద్రబాబు దాదాపుగా డిసైడ్ అయ్యారని అంటున్నారు. 2014 నుంచి 2019 ఎన్నికల దాకా చంద్రబాబు వల్లించింది అనుభవం అన్న మంత్రాన్ని. కానీ జనాలు మాత్రం దాన్ని పెద్దగా రిసీవ్ చేసుకోవడం లేదు. యువ రక్తం కావాలని వారు జగన్ వైపునకు వెళ్ళిపోయారు. అందువల్ల ఓల్డ్ గ్రాండ్ పార్టీగా టీడీపీ మిగిలిపోతోంది. దాంతోనే ఇలాంటి ప్రయోగం చేయాలనుకుంటున్నారుట. మరో వైపు వైసీపీ వచ్చే ఎన్నికల్లో మిగిలిన ముసలీ ముతకా నాయకులను కూడా తప్పించి యూత్ కీ, కొత్త వారికీ చాన్సులు ఇవ్వాలని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తోంది. మరి ఇలా రెండు పార్టీలు గట్టిగా ఆలోచిస్తూంటే అనుభవం కలిగిన సీనియర్ల సంగతేంటి అన్న ప్రశ్న వస్తోంది. వారు రాజకీయాల నుంచి పక్కకు తప్పుకుని రామ క్రిష్ణ అనుకోవడమే మిగిలింది అంటున్నారు. మొత్తానికి చూస్తే జగన్ చూపించిన ఈ దారి ఇపుడు చంద్రబాబుకి కూడా మార్గం అవుతోంది. దాంతో రెండు ప్రధాన పార్టీలూ యూత్ కే ఓటు అంటున్నాయి. 2024 ఎన్నికలలో వీరికే అటూ ఇటూ కూడా టికెట్లు దక్కడం ఖాయం. వీరిలో ఎవరు గెలిచినా వచ్చే అసెంబ్లీ పూర్తిగా యువ రక్తంతో నిడిపోవడం ఖాయం. అంటే రేపటి అసెంబ్లీలో చంద్రబాబు లాంటి కొందరు తప్ప మిగిలిన వారంతా యాభై అయిదేళ్ల లోపు వారే ఉన్నా ఆశ్చర్యం లేదు అంటున్నారు. నిజంగా అదే జరిగితే ఏపీ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయమే ఆవిష్కృతమవుతుంది అనడంలో సందేహమే లేదు.

# 2024 జగన్ అడుగులు



విజయవాడ, జూన్ 4, (న్యూస్ పల్స్)వైసీపీలో కొందరు నేతలను పక్కన పెడతారా ? వచ్చే ఎన్నికల నాటికి వ్యూహం మారిపోతుందా ? 2024 ఎన్నికల నాటికి జగన్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారా ? అంటే.. ఔననే అంటున్నారు పరిశీలకులు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిణామాలు.. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిగా మారిపోవడం ఖాయమని అంటున్నారు. అంటే.. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్ర బీజేపీ-టీడీపీ-జనసేనలతో మహాకూటమి ఏర్పడే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. సో.. నెక్ట్స్ ఎన్నికల్లో ఫైట్ భీకరంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఫైట్‌ను కూడా తట్టుకుని.. మళ్లీ అధికారం దక్కించుకోవాలంటే.. వైసీపీ మరింత పదునుగా వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. ప్రజల నాడిని తెలుసుకున్న నాయకులకు మాత్రం టికెట్లు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉంటుంది. అదే సమయంలో పార్టీని పుంజుకునేందుకు వ్యూహాత్మకంగా అడగులు వేసే నాయకులకు మాత్రమే అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వైసీపీలో ఇప్పుడున్న నేతలకు చెక్ పెడతారని అంటున్నారు పరిశీలకులు. ఈ వరుసలో చాలా మంది సీనియర్లు, వయోవృద్ధులు.. వివాదాస్పద ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి జగన్‌కు ఉన్న పెద్ద లక్ష్యం.. పార్టీని అధికారంలోకి తీసుకురావడం. పరిస్థితి ఎలా ఉన్నా.. ఎన్నిపార్టీలు కూటమికట్టినా.. ఆయన నెగ్గాలి. ఈ క్రమంలోనే ఆయన ఇప్పుడున్న వారిలో తాలు-తప్పలను ఏరేయనున్నారనే ప్రచారం సాగుతోంది. వీరిలో పలు పేర్లు వినిపిస్తున్నాయి. ఈ లిస్టులో వినిపిస్తోన్న కొన్ని పేర్లలో గూడురు వైసీపీ ఎమ్మెల్యే వెలగపూడి వరప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, ఆముదాల వలస ఎమ్మెల్యే తమ్మినేని సీతారాం, సత్తెన పల్లి ఎమ్మెల్యే అంబటి రాంబాబు, తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, నూజివీడు అప్పారావు, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, మంత్రులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, శంకరనారాయణ, గుమ్మనూరు జయరాం సహా చాలా మంది ఈ వరుసలో ఉన్నారని తెలుస్తోంది. వీరి స్థానంలో ఆయా నియోజకవర్గాల్లో కొత్తవారికి అవకాశం ఇచ్చే సూచనలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇక, అదే సమయంలో గత ఎన్నికల్లో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి.. ఎన్నికైన వారిపైనా జగన్ అధ్యయనం చేస్తున్నారని, ప్రజలకు చేరువ కాని నేతలను పక్కన పెట్టాలని భావిస్తున్నారని అంటున్నారు. గత ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన పలువురు యువ ఎమ్మెల్యేలు చాలా మందే ఉన్నట్టు వైసీపీ వర్గాల టాక్ ? మరి ఎవరి తలరాతలు మారతాయో చూడాలి.

# సీనియర్లకు స్వీట్ వార్నింగ్

తిరుపతి, జూన్ 4, (న్యూస్ పల్స్)జగన్ ఎక్కువగా మాట్లాడరు, అది బయట సభలలోనే కాదు, లోపల పార్టీ నేతలతో కూడా ఆయన స్టైల్ అలాగే ఉంటుంది. తక్కువగా మాట్లాడుతూ నేతల తీరును ఆయన జాగ్రత్తగా అంతా గమనిస్తారు. ఆ మాటల నుంచే ఎవరికి తోచిన అర్ధాలు వారు తీసుకోవాల్సిందే. ఇదిలా ఉంటే తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల ఫలితం పట్ల జగన్ ఏమంత సంతృప్తిగా లేరు అన్నది ప్రచారం అవుతోంది. తాను కోరుకున్న అయిదు లక్షల మెజారిటీని నేతలు సాధించలేకపోయారు అన్న బాధ అయితే ఆయనలో ఉంది. అదే సమయంలో పార్టీలో కొందరు ఎమ్మెల్యేలు సరిగ్గా పనిచేయలేదని, ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించలేదని కూడా నివేదికలు జగన్ కి అందాయట. ఇక తిరుపతి కొత్త ఎంపీ గురుమూర్తి జగన్ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనతో పాటు ఆ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు కూడా జగన్ని కలిసిన సందర్భంగా జగన్ చేసినట్లుగా చెప్పబడుతున్న కొన్ని వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపుతున్నాయి. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి బాగా పనిచేశారని, అలాగే శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి చక్కగా పనిచేశారని జగన్ కితాబు ఇవ్వడంతో సీనియర్లు ఖంగు తిన్నారని టాక్. వారసులే బెటర్ అని జగన్ అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. దీన్ని బట్టి చూస్తూంటే జగన్ సీనియర్లను పక్కన పెట్టి యూత్ కే తాను చాన్స్ ఇస్తానని చెప్పకనే చెబుతున్నాట్లుగా ఉంది. వచ్చే ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్ధిగా అభినయ్ రెడ్డి ఉంటారని ప్రచారం సాగుతోంది. ఇక శ్రీకాళహస్తికి బియ్యపు మధుసూదన్ రెడ్డి మీద విమర్శలు ఆరోపణలు ఉన్నాయి. దాంతో ఆయనను పక్కన పెట్టినా ఆ ఇంట్లో నుంచే కుమార్తెను ముందుకు తెస్తారు అన్న టాక్ కూడా ఉంది. ఇదే వరసలో చాలా చోట్ల పదవులలో యువతకే అవకాశాలు ఇవ్వాలని జగన్ ఆలోచిస్తున్నట్లుగా నేతలు కనిపెట్టేశారుట. తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికలో కూడా గురుమూర్తి కొత్త ఫేస్. యువకుడు అని గుర్తు చేస్తున్నారు. పెద్దవాళ్ళు అంటే సలహాలకు మాత్రమే అన్నది జగన్ భావనగా ఉందని అంటున్నారు. పార్టీలో సీనియర్ ఎమ్మెల్యేలు చాలా మంది ఉన్నా కూడా జగన్ యువతకే పెద్ద పీట వేసి మంత్రులను చేశారు. ఇక రానున్న కాలంలో కూడా ఇదే సీన్ ఉంటుందని ఇప్పటికే సూచనలు ఇస్తున్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లు కూడా యువతకే ఎక్కువగా ఇస్తారని జగన్ మాటల బట్టి అర్ధమవుతోంది. దీంతో సీనియర్లకు ఇంకా ఏమైనా అనుమానాలు ఉంటే వాటిని జగన్ తన వ్యాఖ్యల ద్వారా క్లారిఫై చేశారు అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ కోసం అంతా పనిచేయాలని కూడా జగన్ గట్టిగా ఆదేశించారట. వారికే గుర్తింపు గౌరవం అని జగన్ చెప్పడం ద్వారా సీనియర్లకు స్వీట్ వార్నింగే ఇచ్చేశారు అంటున్నారు.

# మళ్లీ ఏపీలో గ్రాండ్ అలయన్స్

విజయవాడ, జూన్ 4, (న్యూస్ పల్స్)చంద్రబాబు రాజకీయ గండర గండడు. కింద పడ్డా పై చేయి నాదే అని వాదిస్తారు. ఆయన ఇపుడు కసి మీద ఉన్నారు. మరోసారి ఏపీలో అధికారం ఎలాగైనా సాధించలన్నది చంద్రబాబు లక్ష్యం. అందుకోసం అటు తూరుపూ ఇటు పడమరను కూడా కలిపేందుకు సిద్ధంగా ఉన్నారట. ఇక ఏపీలో రాజకీయ వాతావరణం కూడా బాబుకు కలసి వస్తోంది. జగన్ కి ఏ ఒక్క పార్టీతోనూ పొత్తు లేదు. దోస్తీ అంతకంటే కూడా లేదు. ఆ అవసరం లేదు అని ఖరాఖండీగా వైసీపీ నేతలు చెప్పేస్తున్నారు. దాంతో అందరికీ పెద్దన్నలా మారి జగన్ మీద ఉసిగొలపడానికి చంద్రబాబు తయారుగానే ఉన్నారట. ఏపీలో ఇదే అన్ని పార్టీల స్లోగన్. జగన్ సర్కార్ మీద విరుచుకుపడడానికి అందరూ పెద్ద నోరుతో ముందుకు వస్తారు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు వైసీపీ ఎదురు నిలిచి పోరాటాలు చేసేది. అప్పట్లో జనసేన సైలెంట్ గా ఉండేది. బీజేపీ ఎటూ చివరి దాకా మిత్ర పక్షంగా ఉంది. ఇక కాంగ్రెస్ తో సహా కామ్రేడ్స్ చంద్రబాబు కంటే జగన్ మీదనే ఎక్కువగా విమర్శలు చేసేవారు. ఒక విధంగా చీలిపోయిన విపక్షంతో బాబుకు నాడు హ్యాపీగా ఉండేది. కానీ ఇపుడు అంతా రివర్స్. జగన్ సైతం లౌక్యంగా ఎవరో ఒకరిని చేరదీయాలనుకోవడంలేదు. దాంతో ఎవరికి ఏ రకమైన కోపాలు ఉన్నా జగన్ మీద ఒక్కసారిగా విరుచుకుపడుతున్నారుమరి దీనిని చూసే చంద్రబాబుకు కొత్త ఆలోచనలు వస్తున్నాయి అనుకోవాలేమో. ఏపీలో జనసేన, వామపక్షాలు జగన్ తో కలిసేందుకు రెడీగా లేవు. అలాగే కాంగ్రెస్ అయితే జగన్ అంటే కస్సుమంటుంది. దీంతో పాటు జాతీయంగా మారుతున్న రాజకీయాన్ని దృష్టిలో ఉంచుకుంటే బీజేపీ కి ఆల్టర్నేషన్ గా యూపీయే ఉంది. దాన్ని కాంగ్రెస్ లీడ్ చేస్తోంది. అందువల్ల ఏపీలో కూడా కాంగ్రెస్ ని దగ్గర చేర్చుకుని జనసేన వామపక్షాలతో గ్రాండ్ అలయెన్స్ ని ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది అన్న దాని మీద టీడీపీలో చర్చలు సాగుతున్నాయట. దేశంలో మోడీకి వ్యతిరేక వాతావరణం ఉందని, దాంతో పాటు ఏపీలో కూడా బీజేపీకి పెద్దగా బలం లేదని అందువల్ల అటు జగన్, ఇటు బీజేపీలను టార్గెట్ చేస్తూ ఈ కొత్త కూటమి ఎన్నికల ముందు రంగంలోకి దిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. నాడు కాబోయే ప్రధాని హోదాలో మోడీ ఏపీ జనులకు భారీ హామీలు ఇచ్చారు. ప్రత్యేక హోదాను ఇస్తామని చెప్పారు. అలాగే ఢిల్లీని తలదన్నే రాజధానిని కూడా నిర్మిస్తామని కూడా అన్నారు. మరి రేపటి రోజున గ్రాండ్ అలయెన్స్ తరఫున కాబోయే ప్రధానిగా రాహుల్ గాంధీతో ఆ హామీ ఇప్పిస్తే వర్కౌట్ అవుతుందని కూడా టీడీపీలో చర్చ సాగుతోందిట. అంతే కాదు ఏపీ లాంటి చితికిపోయిన రాష్ట్రానికి కేంద్రం అండ తప్పకుండా ఉండాలని, అందుకే కాంగ్రెస్ తో పొత్తు అని సమర్ధిచుకోవడానికి కూడా వీలు అవుతుందని పసుపు శిబిరం పెద్దలు తలపోస్తున్నారుట. అదే టైమ్ లో వైసీపీ వల్ల ఏమీ కాలేదని, కేంద్రంలో రేపటి రోజున అధికారంలో వచ్చేది విపక్ష కూటమి కాబట్టి తమకు ఏపీలో కూడా పట్టం కట్టాలని కోరబోతారుట. ఇక ఏపీలో కాంగ్రెస్ కి జీవం పోయాలని కూడా బాబు అతి పెద్ద వ్యూహరచనలో ఉన్నారుట. ఆ పార్టీకి ఎన్నో కొన్ని సీట్లు ఇచ్చి కూటమిలో చేర్చుకుంటే చాలు జగన్ పార్టీకి ఉన్న ఓటు బ్యాంక్ ని భారీగా చీల్చడానికి కూడా ఉపయోగపడుతుంది అన్న విశ్లేషణతోనే ఇదంతా చంద్రబాబు చేయబోతున్నారుట. మరి జగన్ మీద ఇలా దండెత్తి వస్తే ఆయన ఎలా రివర్స్ అటాక్ ఇస్తారు అన్నదే చూడాలి.

## ప్రచారం ఎక్కువ? అభివృద్ధి తక్కువ

### జనసేన నేత మోహనరావు

మైలవరం ముఖ్యమంత్రి రెండు సంవత్సరాల ప్రభుత్వ పనితీరు ప్రచారం ఎక్కువ అభివృద్ధి తక్కువ అని జనసేన రాష్ట అధికార ప్రతినిది అక్కల రామమోహన రావు విమర్శించారు. ప్రజల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా ఉంది. రెండు సంవత్సరాలనుండి ప్రజలకు ఇసుకని తక్కువ ధరకి సప్లయి చేయటం లో విఫలం అయ్యారు. ఇసుక లేక పోవటం వలన ఇసుక పై ఆధార పడి పనిచేస్తున 80 లక్షల మంది రోజువారి కూలీలకు ఉపాధి లేక ఆర్ధికంగా ఇబ్బందులుపడుతున్నారు. మద్యం రేట్లు నిత్యవసర సరుకులు రేట్లు పెరగటం వలన సామాన్యుడు బతకలేని పరిస్థితి వుంది. రైతులు పండించిన పంటను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయక పోవటం సరైన గిటు బాటు ధర రాకపోవటం అన్నదాతలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడ అని అయోమయం పరిస్థితి లలో రాష్ట ప్రజలు వున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రెండు సంవత్సరాలనుండి ఒక పరిశ్రమకు శంకుస్థాపన చేయకపోవటం, సంక్షేమం పెరుతో అభివృద్ధి ని నిర్వీరం చేయటం దీనివల్ల ప్రజలు ఆర్ధికంగా నష్టపోవటం, సంక్షేమం పెరు తో సంవత్సరానికి 15 వేలు ఇస్తున్న డబ్బులు వారి అప్పులు వడ్డీకి సరిపోని పరిస్థితి వుంది. అభివృద్ధి లేక పరిశ్రమలు రాక ఐటి రంగం లేక ప్రజలు యువకులు పక్క రాష్ట లకు వలస వెళ్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి అసమర్ధత పరిపాలన వలన భవన నిర్మాణ కార్మికులు రోజు వారి కూలీలు కార్మికులు చదువుకున్న నిరుద్యోగులు రైతులు అందరు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు

# టార్గెట్ వెలగపూడి..

విశాఖపట్టణం, జూన్ 4, (న్యూస్ పల్స్)ఏపీలో విపక్ష టీడీపీలో కొందరు ఫైర్‌బ్రాండ్ లీడర్లు ఉన్నారు. వీరిలో చాలా మందికి జగన్ గత ఎన్నికల్లో చెక్ పెట్టేశారు. చింతమనేని ప్రభాకర్, పరిటాల శ్రీరామ్ లాంటి ఫైర్ బ్రాండ్లుగా పిలుచుకునే నేతలే కాకుండా ఎంతో మంది సీనియర్లు సైతం గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారు. అయితే జగన్ ప్రభంజనం ఈ స్థాయిలో ఉన్నా కూడా కొందరు కీ రోల్ పోషించే నేతలు, ఫైర్‌బ్రాండ్లు విజయం సాధించారు. గొట్టిపాటి రవికుమార్, ఏలూరు సాంబశివరావు, వెలగపూడి రామకృష్ణ, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు లాంటి నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇలాంటి వారిలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఒకరు. కృష్ణా జిల్లా పెదపారుపూడికి చెందిన ఆయన విశాఖలో రెండు దశాబ్దాల క్రితమే కాలు మోపారు. టీడీపీలో చిన్న కార్యకర్తగా కెరీర్ స్టార్ట్ చేసి విశాఖ తూర్పు నియోజకవర్గాన్ని అడ్డాగా చేసుకుని మూడు సార్లు ఓటమి లేకుండా వరుసగా వెలగపూడి రామకృష్ణ బాబు విజయాలు సాధిస్తూ వస్తున్నారు. వెలగపూడి మూడు సార్లు గెలిచినా.. మూడు సార్లు ఆయన గెలుపునకు ఏదో ఒక లక్ చిక్కింది. బలహీన ప్రత్యర్థులో లేదా ఇతర పార్టీల్లో సమీకరణలో, ట్రయాంగిల్ ఫైటో జరిగి వెలగపూడి రామకృష్ణ బాబు మూడు సార్లు ఎమ్మెల్యే అయ్యారు. గత ఎన్నికల్లో వైసీపీ వేవ్‌లో ఆయన 25 వేల ఓట్ల మెజార్టీతో గెలవడానికి ప్రధాన కారణం వైసీపీ నుంచి బలమైన ప్రత్యర్థి లేకపోవడమే. అప్పటి వరకు భీమిలి ఇన్‌చార్జ్‌గా ఉన్న అక్కరమాని విజయనిర్మలకు తూర్పు సీటే ఇవ్వడమే జగన్ చేసిన రాంగ్‌స్టెప్. గత ఎన్నికల్లో గెలిచిన వెలగపూడి రామకృష్ణ బాబుకి వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవకూడదని జగన్ మార్క్ ఆపరేషన్ స్టార్ట్ అయ్యింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న విజయసాయి రెడ్డి తూర్పు నియోజకవర్గంపై బాగా ఫోకస్ చేస్తూ వస్తున్నారు. అక్కడ ఇన్‌చార్జ్‌గా విజయనిర్మలనే కొనసాగిస్తూ.. తెరవెనక చక్రం అంతా విజయసాయే తిప్పేస్తున్నారు. విశాఖ నగరంలో నార్త్‌లో గంటా దెబ్బతో టీడీపీ వీక్ అయ్యి వైసీపీ స్ట్రాంగ్ అయ్యింది. దక్షిణంలో వాసుపల్లి వైసీపీ చెంత చేరిపోయారు. పశ్చిమంలో గణబాబు ఎప్పుడు అయినా సైకిల్ ఎక్కేయవచ్చని టాక్? అందుకే తూర్పు మీద బాగా ఫోకస్ పెట్టిన విజయసాయి వెలగపూడి రామకృష్ణ బాబును దెబ్బకొట్టేందుకు ఉన్న చిన్న అవకాశం కూడా వదులుకోవడం లేదు. ఎగ్జిగ్యూటివ్ క్యాపిటల్‌గా అంగీకరించని ఆయన్ను టార్గెట్‌గా చేసుకుని ఓ బలమైన వ్యతిరేక ప్రచారం ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. ఆయన భూకబ్జాలు, లిక్కర్ దందాలు బయట పెట్టడంతో పాటు విశాఖ ఎంపీ ఎంవీవీ కూడా కమ్మ నేతే కావడంతో ఆయన ద్వారా వెలగపూడి రామకృష్ణ బాబుకి కొమ్ము కాసే బలమైన కమ్మ నేతలను కూడా వైసీపీ వైపు తిప్పేశారు. సంవత్సరాలుగా ఆయన వెంటే ఉంటోన్న కమ్మ బడా బాబులు ఇప్పుడు వైసీపీ చెంత చేరిపోవడంతో వెలగపూడి రామకృష్ణ బాబు కొమ్మలు విరిచేసినట్లయ్యింది. దీనికి తోడు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఆయనకే సపోర్ట్ చేస్తోన్న యాదవుల్లో మెజార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కేడర్ టీడీపీకి, ఆయనకు దూరమయ్యారు. ఈ పరిణామాలతోనే తూర్పులో ఇటీవల జీవీఎంసీ ఎన్నికల్లో వైసీపీ మెజార్టీ డివిజన్లు గెలుచుకుంది. ఏదేమైనా వెలగపూడి రామకృష్ణ బాబుచుట్టూ విజయసాయి అష్టదిగ్భందనం వేయడంతో ఆయన కూసాలు కదులుతున్నాయి. ఆయన పట్టు సడలుతోందన్నది వాస్తవం.

# గౌరు చరితా రెడ్డి... కిం కర్తవ్యం

కర్నూలు, జూన్ 4, (న్యూస్ పల్స్)రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత.. ఎవరూ ఎవరికీ శాశ్వత మిత్రులు కారు.. శాశ్వత శత్రువులు కూడా కారు. అవకాశం.. అధికారం.. అనే రెండు పట్టాలపైనే పార్టీలు, నేతలు పరుగులు పెడతారు. ఎక్కడ వారికి అవకాశం చిక్కితే.. అక్కడ బ్రేకులు వేసుకుంటారు. మళ్లీ అక్కడ అవకాశం మృగ్యమైతే.. మళ్లీ మరో దిశగా తమ ప్రయాణం సాగిస్తారు. ఇలాంటి క్రమంలో నాయకులకు పార్టీలు మారడం, పార్టీలకు నాయకులను చేర్చుకోవడం వంటివి సాధారణంగా మారిపోయాయి. అయితే.. ఇలా పార్టీ మారిన వారు.. ఇప్పుడు ఇక్కడ ఉండలేక.. గతంలో ఉన్న పార్టీలోకి వెళ్లే అవకాశం లేక.. నానా తిప్పలు పడుతున్నారని అంటున్నారు పరిశీలకులు.కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున 2014 ఎన్నికల్లో విజయం దక్కించుకున్నారు గౌరు చరితా రెడ్డి. ఆ ఎన్నికల్లో విజయం దక్కించుకున్న గౌరు చరితా రెడ్డికి వైసీపీ అధినేత? జగన్ మంచి వాల్యూ ఇచ్చారు. చరిత భర్త వెంకటరెడ్డి జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా పని చేయడంతో పాటు ఎమ్మెల్సీగా కూడా పోటీ చేశారు. అయితే.. ఎన్నికలకు ముందు.. ఆమె పార్టీ మారిపోయారు. చంద్రబాబుకు జై కొట్టారు. ఒక్కసారి గెలుపునే సొంత బలంగా భావించిన గౌరు చరితా రెడ్డి.. ఎక్కడున్నా తమ గెలుపును ఎవరూ ఆపలేరు.. అంటూ..వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే.. సీనియర్ నాయకుడు.. ఫైవ్ టైమ్ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వైసీపీలో చేరడంతో జగన్ ఆయనకే పాణ్యం సీటు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో గౌరు దంపతులు టీడీపీలో చేరిపోయారు.ఇక, టీడీపీలో చేరిన గౌరు చరితా రెడ్డి టికెట్ అయితే .. తెచ్చుకున్నా 44 వేల ఓట్ల భారీ తేడాతో ఘోరంగా ఓడిపోయారు. ఇక, అప్పటి నుంచి టీడీపీలోనూ యాక్టివ్‌గా ఉండలేక పోతున్నారు. ఇక, ఈ పరిణామం గౌరు చరితా రెడ్డి కుటుంబంలోనూ చిచ్చు రేపిందని ప్రచారం జరిగింది. ప్రస్తుతం జిల్లాలో టీడీపీని నడిపించే నాయకులు ఎవరూ కనిపించడం లేదు. పైగా ఎవరికివారుగా చక్రం తిప్పుతున్నారు. ఈ క్రమంలో చరితా రెడ్డిని పట్టించుకునేవారు.. ఎవరూ కనిపించడం లేదు. పార్టీ అధినేత కూడా జంపింగులపై దృష్టి పెట్టడం లేదు. ఎవరినీ ఆయన పలకరించడం లేదు.దీంతో గౌరు చరితా రెడ్డి ఏమాత్రం వైసీపీ నుంచి సిగ్నల్ వచ్చినా.. పార్టీలోకి వచ్చేయాలని చూస్తున్నారు. మనిషిగా మాత్రమే టీడీపీలో ఉన్నారు తప్ప..ఎలాంటి కార్యక్రమాలూ ఆమె చేపట్టడం లేదు. దీంతో టీడీపీ శ్రేణులు కూడా ఆమెను పట్టించుకోవడం లేదు. ఏ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు. మొత్తంగా చూస్తే.. ఒక్కగెలుపు పెంచిన ధీమా.. మొత్తం రాజకీయ ఫ్యూచర్‌పైనే ప్రభావం చూపించిందని అంటున్నారు పరిశీలకులు. ఇక, ఇప్పట్లో వైసీపీ నుంచి గౌరు చరితా రెడ్డికి పిలుపు అందే పరిస్థితి లేదని చెబుతున్నారు. జగన్ ఎన్నికలకు ముందు పార్టీ మారవద్దు.. ఎమ్మెల్సీ సీటు ఇస్తానని చెప్పినా పార్టీ మారిపోయారు. అందుకే జగన్ గౌరు చరితా రెడ్డి దంపతులపై అదే కోపంతో ఉన్నారని.. పైగా ఇప్పుడు పార్టీలోకి వచ్చినా బండి ఇప్పటికే ఓవర్ లోడ్ అవ్వడంతో వాళ్లను చేర్చుకున్నా వాళ్లకు, పార్టీకి ఒరిగేదేమి ఉండదన్న చర్చలు కూడా ఉన్నాయి.

# జాపాలి శ్రీ ఆంజనేయస్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన టిటిడి అదనపు ఈవో

తిరుమల జూన్ 04 తిరుమలలోని జాపాలి తీర్థంలో గల శ్రీ ఆంజనేయస్వామివారికి హనుమజ్జయంతి సందర్భంగా టిటిడి అదనపు ఈవో శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి దంపతులు శుక్రవారం ఉదయం పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ ఆకాశ గంగ తీర్థంలో అంజనాదేవి తపస్సు చేసి వాయుదేవుని ఆశీర్వదంతో ఆంజనేయస్వామివారికి జన్మనిచ్చిందన్నారు. త్రేతయుగంలో అంజనాద్రి కొండపై జాపాలి మహర్షి తపస్సు చేసి ఆంజనేయస్వామివారిని ప్రసన్నం చేసుకున్నారని తెలిపారు. కావున ఈ క్షేత్రానికి జాపాలి క్షేత్రం అని పేరు వచ్చిందని, ఇక్కడ ఉన్న స్వామివారు స్వయంభూ అని వివరించారు. దుష్ట శక్తులను సంహరించే ఆంజనేయస్వామివారు కరోనా మహమ్మరిని నిర్మూలించి లోకంలోని ప్రజలకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తారన్నారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి అదనపు ఈవో దంపతులకు, సివిఎస్వో శ్రీ గోపినాథ్ జెట్టి దంపతులకు హథీరాంజీ మఠం మహంతు శ్రీ అర్జున్‌దాస్ స్వాగతం పలికారు. కారోనా వైరస్ వ్యాప్తి నివారణ చర్యలలో భాగంగా శ్రీ ఆంజనేయస్వామివారికి అభిషేకం, పూజ కార్యక్రమాలను ఏకాంతంతగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాపాలి క్షేత్రంలో టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ పి.ఆర్.ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యంలో కళాకారులు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు ఆచార్య దక్షిణామూర్తి శర్మ ఆధ్వర్యంలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీ వెంకటేశ్వర్లు భాగవతార్ ఆంజనేయస్వామివారి అవిర్భంపై హరికథ పారాయణం చేశారు.

# శ్రీ కోదండరామాలయంలో ఏకాంతంగా హనుమజ్జయంతి

తిరుపతి, జూన్ 04 తిరుపతిలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం హనుమజ్జయంతి ఏకాంతంగా జరిగింది. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో సాయంత్రం జరగాల్సిన హనుమంత వాహనసేవను టిటిడి రద్దు చేసింది. శరణాగత భక్తికి ఆదర్శంగా నిల్చిన ఆంజనేయస్వామివారి జయంతిని టిటిడి ఆనవాయితీగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం 8 గంటలకు స్వామివారి మూలవర్లకు అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటి ఈఓ శ్రీమతి పార్వతి, ఏఈఓ శ్రీ దుర్గరాజు, సూపరింటెండెంట్ శ్రీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దానాలన్నింటిలోకి అన్నదానం మిన్న అని, అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదు...

**కడప తాలూకా సిఐ నాగభూషణం**

కడప కొవిడ్ బాధితుల సహాయకులకు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని, పుణ్య కార్యమని కడప తాలూకా సిఐ నాగభూషణం పేర్కొన్నారు. యూపీ నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సహాయ సహకారాలతో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం వారు ప్రతిరోజు లాగే చేయు అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప తాలూకా సిఐ నాగభూషణం హాజరై అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవ చేయడానికి ట్రస్ట్ లు ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.యూపీ నరసింహా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మొదటి వేవ్ కరోనా లో ఇబ్బందులు పడుతున్న వారికి తమ వంతు చేయూతగా సహాయ సహకారాలు అందించడం, అన్నదానం తోపాటు పలు సేవా కార్యక్రమాలు చేయుచున్న యూపీ నరసింహా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ను ఆదర్శంగా తీసుకొని మరింతమంది సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని తెలిపారు. యూపీ నరసింహా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సహాయ సహకారాలతో నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేయడం హర్షనీయమన్నారు. రిమ్స్ హాస్పిటల్ వద్ద ప్రతి రోజులాగే గురువారం దాదాపు 300 మందికి అన్నదానం చేసినట్లు ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ నాగభూషణం కు యూపీ నరసింహా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఎన్ హెచ్ ఆర్ పి ఫోరం సమక్షంలో శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూపీ నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు శ్రీనివాసన్, సునీల్, సంతోష్ కుమార్, హర్షవర్ధన్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాన్ లోకల్ లీడర్స్ దే పెత్తనం

గుంటూరు, జూన్ 4, (న్యూస్ పల్స్)రాజధాని ప్రాంతంగా పేరొందిన గుంటూరు నగరంపై నాన్ లోకల్ లీడర్స్ వైసీపీ నేతలు పెత్తనం చేస్తున్నారని అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి ఇక్కడ తూర్పు, పశ్చిమ.. నియోజకవర్గాల నుంచి వైసీపీ, టీడీపీ గెలుపొందాయి. అయితే.. తర్వాత పశ్చిమ నియోజకవర్గం నుంచి గెలిచిన టీడీపీ మద్దాలి గిరిని వైసీపీలోకి ఆహ్వానించారు. టెక్నికల్‌గా ఆయన టీడీపీ అభ్యర్థే అయినా.. మద్దతు పరంగా చూస్తే.. వైసీపీలో కొనసాగుతున్నారు. ఇక, ఈయనను పార్టీలోకి తీసుకువచ్చిన మంత్రి వెలంపల్లి శ్రీనివాస్.. గుంటూరులో తరచూ పర్యటిస్తూ.. ఇక్కడ కార్యక్రమాలను చక్కబెడుతున్నారని అంటున్నారు వైసీపీ నాయకులు.ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఏకంగా ఈ రెండు నియోజకవర్గాలతో పాటు పార్లమెంటు పరిధిలోకి వచ్చే అన్ని నియోజకవర్గాల్లోనూ ఆయనదే పెత్తనం అన్నట్టుగా సాగిస్తున్నారట. అదే సమయంలో జిల్లాలోని సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి గెలిచిన అంబటి రాంబాబు కూడా నగరంలో తిష్టవేసి.. తన వారికి కాంట్రాక్టులు ఇప్పించుకునేందుకు చక్రం తిప్పుతున్నారు. అంబటి సీనియర్ కావడంతో ఆయన ఇటు గుంటూరు నగరంలో పెత్తనం చేయడంతో పాటు పక్కనే ఉన్న తాడికొండలో కూడా పెత్తనం చేస్తున్నారట. ఈ విషయంలోనే అంబటికి, తాడికొండ వైసీపీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి అంతర్గత యుద్ధం నడుస్తోందంటున్నారు.ఇక జిల్లా నేతలతో పాటు వైసీపీ రాష్ట్ర కార్యాలయ కార్యనిర్వాహక కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వీళ్లంతా గుంటూరుపై పెత్తనం చేయడం వెనక చాలా కారణాలే ఉన్నాయంటున్నారు. గుంటూరు నగరంలో ఇప్పుడు ప్రభుత్వం అనేక రూపాల్లో కార్యక్రమాలు చేపట్టింది. రాజధానిని తరలించేందుకు సిద్ధమైన ప్రభుత్వం.. ఇక్కడ ఏర్పడిన వ్యతిరేకతను చల్లార్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే గుంటూరును అభివృద్ధి చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ పనులను తమ వారికి ఇవ్వాలంటే.. తమ వారికి ఇవ్వాలంటూ..

ఇక్కడి నియోజకవర్గాలతో సంబంధం లేని ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా చక్రం తిప్పుతున్నారు.ఇక, తూర్పు నియోజకవర్గం నేత ముస్తాఫా.. సీనియర్ అయినప్పటికీ.. అందరిలోనూ మంచిగా ఉండాలనే లక్ష్యంతోనో.. లేక వివాదాలు ఎందుకులే అనుకుంటున్నారో.. మొత్తానికి ఆయన కూడా మౌనంగా ఉంటున్నారు. ఇక పశ్చిమంలో గిరి జంపింగ్ నేత కావడంతో ఆయన మాట లెక్క చేసేవారే లేరు. ఫలితంగా ఇక్కడ ఇతర ప్రాంతాలు, జిల్లాల నుంచి వస్తున్న వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారని.. స్థానికంగా ఉన్నవారికి ఎలాంటి పనులు లభించడం లేదని వైసీపీ నేతలు గుసగుసలాడుకుంటున్నారు.

# చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం

విశాఖపట్నం విశాఖ మధురవాడలో కలకలం రేపిన చిన్నారి హత్య కేసును పోలీసులు విచారణ చేపట్టారు. మధురవాడలోని ఐదోవార్డు మారికవలస గ్రామంలో మూడేళ్ల చిన్నారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై దర్యాప్తులో భాగంగా బాలిక మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. మారికవలస గ్రామానికి చెందిన లారీ క్లీనర్ రమేశ్కు అదే గ్రామానికి చెందిన వరలక్ష్మితో 2016లో వివాహమైంది. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వరలక్ష్మికి అక్రమ సంబంధం ఉందని రమేశ్ అనుమానిస్తూ వచ్చాడు.ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. కాగా, మూడు నెలల క్రితం పాపతో సహా వరలక్ష్మి వేరే వ్యక్తితో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా బుధవారం వరలక్ష్మి రమేశ్కు ఫోన్చేసి పాప చనిపోయింద ని తెలిపింది. దీంతో ఆవేదన చెందిన రమేశ్.. కుటుంబ సభ్యులతో కలిసి భార్య వద్దకు వెళ్లారు. అయితే అప్పటికే అంత్యక్రియలు పూర్తి చేశారు. పాప మృతిపై అనుమానం వ్యక్తం చేసిన రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్కు తరలించారు.దీనిపై దర్యాప్తు జరుపుతోంది పీఎం పాలెం సిఐ రవి కుమార్ తెలిపారు.

# యువకుడి ఆత్మహత్యాయత్నం

విశాఖపట్నం విశాఖ గోపాలపట్నం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. గాయంతో స్థానిక లక్ష్మీనగర్ ప్రధాన రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.లక్ష్మీనగర్ ప్రధాన రహదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి చేతిపై తెగిన గాయంతో పడిఉన్నాడు. స్థానికులు అతని వద్దకు వెళ్లి పరిశీలిస్తే జేబులో సూసైడ్ నోట్ దొరికింది. తన భార్య లలితను క్షమించమని కోరుతూ ఆ లేఖలో రాశాడు. తాను చనిపోతు న్నానని, తనను క్షమించాలని కోరాడు. అదే విధంగా తాను చనిపోయిన తరువాత మంచి వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని ఆ ఉత్తరంలో రాశాడు. స్థానికులు 108కు సమాచారం అందజేసి ఆ వ్యక్తిని కేజీహెచ్కి తరలించారు.

# సరిహద్దులు మూసేసిన ఏపీ పోలీసులు

విజయవాడ కృష్ణ జిల్లాలోరి తెలంగాణ సరిహద్దుల్లో ఏపీ పోలీసుల హైడ్రామా నడిచింది. వత్సవాయి మండలం తాళ్లూరు మీదుగా మధిర వెళ్లే వాహనదారులను అడ్డగించారు. తెలంగాణ ఈ-పాస్ చూపిస్తేనే అనుమతిస్తామంటూ ఆపివేసారు. ఉదయం లేస్తే రైతులు, స్థానికులు పక్కపక్క మండలాలైన వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామకు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని చేతులు తడిపితేనే ఏపీ పోలీసులు సరిహద్దుల్లో అనుమతిస్తున్నారు. వాహనదారుల అడ్డగింత తమకు తలనొప్పిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ పోలీసులకు లేని ఆసక్తి ఏపీ పోలీసులకు ఎందుకని నిలదీసారు. ఏడు కిలోమీటర్ల దూరంలో పోలీసులు మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసారు.

# నీట మునిగిన పంటపొలాలు

కడప కడప జిల్లా వేంపల్లె మండలంలో కురిసిన వర్షాలకు పంట పొలాలు నీటమునిగాయి.గండి పాపాగ్ని నదికి వర్షపు నీరు వచ్చి చేరాయి. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల వేరుశనగ పంట నీట మునిగింది. ఎడతెరపి లేకుండా భారీ వర్షాల కారణంగా కుందూ ఉధృతంగా ప్రవహిస్తోంది. దాదాపు అడుగు మేర నీరు ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల సాగైన వరి పొలాలు దాదాపుగా నీట మునిగాయి.అధిక వర్షానికి మొలక దశ లోనే అది పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది.దింతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఖని లో హనుమాన్ జయంతి వేడుకలు

పెద్దపల్లి జూన్ 04 గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని హనుమాన్ దేవాలయాల్లో శుక్రవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిఎం కాలనీలోని సంజీవ ఆంజనేయ స్వామి ఆలయంలో 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం మృత్యుంజయ హోమం, హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండెబోయిన వెంకటయ్య, దమ నరసయ్య, గుండబోయిన సదానందం, కొమురవెల్లి విశ్వనాథ్, గుండెపైన భూమయ్య, బొగ్గుల సాయికృష్ణ, కొమురవెల్లి సాగర్, ఐటికాల మహేందర్, తుడి ఓదెలు, ఫొలేరాజ్ రాజ్ కుమార్, బిక్షపతి, ప్రశాంత్, వంశీ, మదుపు శ్రీనివాస్, సమ్మయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

# ఆర్టీసీని రక్షించేది ఎలా




హైదరాబాద్, జూన్ 4, (న్యూస్ పల్స్)ఆర్టీసీని ఎలాగైనా రక్షించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది ఆర్థిక ఇబ్బందుల్లో వున్న ఆర్టీసీని ఆర్ధికంగా ఆదుకుంటున్నారు. ఈ క్రమంలో 2017-18 బడ్జెట్లో ఆర్టీసీకి ప్రభుత్వం రూ.994 కోట్లు కేటాయించింది. సబ్సిడీల కోసమే రూ.520 కోట్లు కేటాయించింది. 2016-17 కేటాయింపులతో పోల్చితే 2017-18 బడ్జెట్లో రూ.511.17 కోట్లు అదనంగా కేటాయించారు. అలాగే, 2018-19 బడ్జెట్లో రూ.975.55 కోట్లు, 2019-20 బడ్జెట్లో రూ.630 కోట్లు, 2020-21లో రూ.1,000 కోట్లు కేటాయించారు. రూ.350 కోట్లతో కొత్తగా 1350 బస్సులు కొనుగోలు చేశారు. 2017 మే 4న 60 మినీ ఏసీ బస్సులు (వజ్ర), 50 మినీ బస్సులు (పల్లె వెలుగు) వంద శాతం బయోడీజిల్ తో నడిచే రెండు బస్సులను ప్రారంభించారు. మరో 100 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు.మొదట 20 బస్సులను జేఎన్టియు నుంచి శంషాబాద్ వరకు, ఆ తరువాత సికింద్రాబాద్ నుంచి ఎయిర్ పోర్ట్ వకరు మరో 20 బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడకం ద్వారా వచ్చే ఫలితాలు, డిమాండ్ నేపథ్యంలో రెండో విడుతలో మరో 50 బస్సులను అద్దెకు తీసుకోవాలని ప్రభుత్వం బావిస్తుంది. ఈ మేరకు గోల్డ్‌స్టోన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీతో ఆర్టీసీ ఒప్పందం చేసుకున్నది. మొత్తంగా అన్ని రకాల బస్సులు కలుపుకొని 2013-14 లో 10,406 బస్సులు నడువగా, 2019-20 లో 9,691 బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో జిల్లాల్లో 2015-16తో పోలిస్తే 2016-17 లో రూ.233 కోట్ల నష్టం తగ్గింది. మొత్తంగా 60 కోట్ల నష్టం తగ్గింది.ఇందనం పొదుపులో వరుసగా రెండో సారి దేశంలోనే స్థానాన్ని సంపాదించుకుంది టీఎస్‌ఆర్టీసీ. ప్రతీ లీటరుకు 5.45 కి.మీ. మైలేజి సాదిస్తున్నది. మరే ప్రభుత్వ రంగ సంస్థ ఇవ్వని విధంగా.. ఆర్టీసీ సంస్థ ఏటా ఉద్యోగుల జీతాల కోసం 52శాతం ఆదాయాన్ని అంటే సుమారుగా రూ.2400 కోట్లు ఖర్చు చేస్తున్నది. దీంతో సంస్థకు ఇబ్బందికర పరిణామాలు తలెత్తుతున్నందున ఆర్టీసీ ఉద్యోగుల జీతాల పెంపు వల్ల పడిన ఆర్థిక భారం రూ.750 కోట్లను ప్రభుత్వమే భరిస్తోంది. 2013-14 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం ఆర్టీసీకి రూ.121.95 కోట్ల సబ్సిడీ ఇవ్వగా, 2019-20 లో టిఆర్ఎస్ ప్రభుత్వం రూ.460 కోట్ల ఇచ్చింది. టీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా రోజుకు 98 లక్షల మందిని గమ్యానికి చేరుస్తుంది. సుమారుగా 10,500 బస్సులు నడుస్తున్నాయి.హైదరాబాద్ లో ఈ సంస్థ రూ.218 కోట్ల నష్టంలో ఉంది. ప్రపంచంలో ఎక్కడైనా అర్బన్ ట్రాన్స్ పోర్ట్ నష్టాల్లోనే ఉంటుందని, ఈ అర్బన్ ట్రాన్స్ పోర్ట్ ను అక్కడి ప్రభుత్వాలే నిర్వహిస్తుంటాయని గుర్తించిన ప్రభుత్వం మన రాష్ట్రంలోనూ అలాంటి విధానాన్నే అవలంభించాలని 2015 సెప్టెంబర్ 2న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించింది. దీంతో ఇక టీఎస్‌ఆర్టీసీ నష్టాలను జీహెచ్‌ఎంసీ భరించనుంది. హైదరాబాద్ లో 3800 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. వాటి నష్టాలను జీహెచ్‌ఎంసీ నిధుల నుంచి పూడ్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ను ఆర్టీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టరుగా నియమిస్తూ చట్ట సవరణ చేశారు. రూరల్ ఏరియాలో వచ్చే ఆదాయంలో అప్పులు కట్టనున్నారు. బస్టాండ్ల నిర్వహణ తదితర అంశాలపై కమిషనరే నిర్ణయం తీసుకుంటారు. టీఎస్‌ఆర్టీసీకి జీహెచ్‌ఎంసీ నుంచి రూ.336 కోట్లు ఇప్పించారు.బస్సుల్లో జీపీఎస్, ప్యానిక్ బటన్ ను తప్పనిసరి చేశారు. ప్రమాదాల నివారణకు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం 9691 బస్సుల్లో మొత్తం రోజుకు 98 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణం చేస్తున్నారు. సుమారుగా రోజుకు రూ.12 కోట్ల కలెక్షన్ వస్తుంది. ఇంత మంది ప్రయాణీకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు. మొదట పైలెట్ ప్రాజెక్టుగా 400 బస్సులకు జీపీఎస్ పరికరాలను అమర్చి హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో అమలు చేస్తున్నారు.తెలంగాణ ఆర్టీసీ సంస్థను నడిపించడానికి యాజమాన్యం ఒక దశలో ఉద్యోగుల సహకార సంఘం డబ్బులను కూడా వినియోగించుకోవలసి వచ్చింది. అందుకే ప్రభుత్వం స్పందించి ఆర్టిసిని ఆదుకుంది. ఆర్టీసీ ఏడాదికి 49,115 మంది ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి రూ. 2858.77 కోట్లు ఖర్చు చేస్తున్నది.2013-14లో రూ.1,622.33 కోట్లు ఖర్చు చేసేవారు. కేవలం జీతభత్యాల మీదనే ఆర్టీసీ సంస్థ తన ఆదాయంలో 52 శాతం పైగా ఖర్చు పెడుతున్నది. 2013-14 లో ఆర్టీసీ ఉద్యోగుల సగటు వేతనం రూ.23,293 ఉండగా, 2019-20 లో అది రూ.48,504 కు చేరింది. 2013-14 లో ఉద్యోగుల వేతనాల కోసం రూ.1,622.33 కోట్లు ఖర్చు చేయగా, 2019-20 నాటికి వీరి జీతాల కోసం రూ.2,858.77 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మరే ప్రభుత్వ రంగ సంస్థ కూడా ఇంత పెద్ద మొత్తంలో జీతాల మీద ఖర్చు పెట్టడంలేదు. ఆర్టిసి సిబ్బందికి 44శాతం ఫిట్ మెంట్ పెంచుతూ ప్రభుత్వం 2015 మే 13న నిర్ణయం తీసుకుంది. 2015 జూన్ నుంచి దీనిని అమలు చేసింది. సమ్మె సమయంలో పెట్టిన కేసులను ఉపసంహరించుకుంది. ఏపీలో 43 శాతం ఫిట్ మెంట్ ప్రకటిస్తే, తెలంగాణలోని 55 వేల మంది ఉద్యోగులకు 44 శాతం ఫిట్ మెంట్ ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులకు రూ.750 కోట్లని విడుదల చేసి వారి బారాన్ని తగ్గించింది.

# శ్రీ శివమార్కండేయ కోటి నవదుర్గ ఆలయ కమిటీ బాధ్యతల స్వీకరణ..

కోరుట్ల జూన్ 04 పట్టణంలోని శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ ఆలయంలోపద్మశాలి నూతన కార్యవర్గం కమిటీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ హాజరై నూతన కమిటీ తో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులుగా : గుడ్ల మనోహర్, ఉపాధ్యక్షులుగా: కటుకం రవి ( భారత్ సెల్ పాయింట్ ), ప్రధాన కార్యదర్శిగా : వాసాల గణేష్, సహాయ కార్యదర్శులుగా : బండి సురేష్, గోసికొండ కుమార స్వామి , డైరెక్టర్లుగా : కటుకం నారాయణ ముల్క రాజేశం , మాసం శంకర్ , అందె రాజ్ కుమార్ , పిన్నంశెట్టి శ్రీనివాస్ ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ నూతన అధ్యక్షులు గుడ్ల మనోహర్ మాట్లాడుతూ కులబాంధవులు తమకు అప్పగించిన బాధ్యతలు నిర్విఘ్నంగా కొనసాగిస్తామని, ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూనే, నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకపోతామన్నారు.

# రానున్న మేడిన్ ఇండియా వ్యాక్సిన్లు

న్యూఢిల్లీ, జూన్ 4, (న్యూస్ పల్స్)కరోనాపై పోరులో విజయం సాధించడానికి ప్రపంచం ముందున్న ఏకైక మార్గం వ్యాక్సిన్. అందుకే అన్ని దేశాలూ ఈ వ్యాక్సిన్లపైనే దృష్టి సారించాయి. భారత ప్రభుత్వం కూడా ఈ ఏడాది చివరిలోపే దేశంలో 18 ఏళ్లు నిండిన అందరికీ వ్యాక్సిన్లు ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా గురువారమే హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్-ఈ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇదొక్కటే కాదు.. త్వరలోనే మరిన్ని ఇండియన్ మేడ్ వ్యాక్సిన్లు మార్కెట్లోకి రానున్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం.జైడస్ కాడిలా.. 5 కోట్ల డోసులుఅహ్మదాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ జైడస్ కాడిలా నుంచి జైకోవ్-డీ అనే కొవిడ్ వ్యాక్సిన్ వస్తోంది. ఈ ఏడాది చివరిలోపు 5 కోట్ల డోసుల వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. అంతేకాదు 5 నుంచి 12 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలపై కూడా ఈ సంస్థ తన వ్యాక్సిన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు చెప్పింది.జెన్నోవా.. 6 కోట్ల డోసులుపుణెకు చెందిన జెన్నోవా బయోఫార్మాసూటికల్స్ కంపెనీ కూడా హెచ్‌జీసీ019 పేరుతో కొవిడ్ వ్యాక్సిన్లు తయారు చేస్తోంది. ఈ సంస్థ 6 కోట్ల డోసులు ఇవ్వనుంది. ఇండియాలో తొలి ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌పై ఈ సంస్థ పని చేస్తోంది. ప్రస్తుతం తొలి దశ ట్రయల్స్‌లో ఉంది. రెండు నెలల్లో ఇది పూర్తి కానుంది. ఆ తర్వాత రెండో దశ ట్రయల్స్ ప్రారంభమవుతాయి.భారత్ బయోటెక్ నాసల్ వ్యాక్సిన్ఇక ఇప్పటికే కొవాగ్జిన్ టీకా తయారు చేస్తున్న హైదరాబాద్‌కే చెందిన భారత్ బయోటెక్ నుంచి ముక్కు ద్వారా వేసే వ్యాక్సిన్ కూడా వస్తోంది. డిసెంబర్‌లోగా ఇలాంటి 10 కోట్ల వ్యాక్సిన్ డోసులు రానున్నట్లు గత నెలలో కేంద్ర ఆరోగ్య శాఖ కూడా వెల్లడించింది. ఇది కూడా ప్రస్తుతం తొలి దశ ట్రయల్స్‌లో ఉంది. ఈ వ్యాక్సిన్ పేరు బీబీవీ154.నొవావ్యాక్స్.. 20 కోట్ల డోసులు అమెరికాకు చెందిన నొవావ్యాక్స్ కంపెనీ టీకాను ఇండియాలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా తయారు చేయనుంది. ఈ మధ్యే అమెరికా ముడిసరుకులపై నిషేధం ఎత్తేయడంతో ఈ వ్యాక్సిన్ తయారీకి లైన్ క్లియరైంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ వ్యాక్సిన్ ప్రపంచ మార్కెట్‌లోకి రానుంది. డిసెంబర్‌లోగా సీరం 20 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఇవ్వనుంది.వీటికి తోడు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కొవిషీల్డ్, కొవాగ్జిన్ డోసులు కూడా భారీగా వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబర్‌లోగా 75 కోట్ల కొవిషీల్డ్, 55 కోట్ల కొవాగ్జిన్ డోసులు రానున్నట్లు అంచనా వేసింది. ఇక రష్యాకు చెందిన స్పుత్నిక్ వి వ్యాక్సిన్లు 15.6 కోట్ల డోసుల మేర అందుబాటులోకి రానున్నాయి.ఫైజర్, మోడర్నా సంప్రదింపులుభారత్ లో స్థానికంగా వ్యాక్సిన్ తయారీ చేపట్టేలా ఫైజర్, మోడెర్నా, జాన్సన్ వంటి విదేశీ వ్యాక్సిన్ తయారీ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందం బాగ్చి గురువారం పేర్కొన్నారు. భారత్ లో సత్వరమే స్పుత్నిక్ వీ వ్యాక్సిన్ల సరఫరాలు చేపట్టేలా తాము సహకరించామని చెప్పారు.మహమ్మారి విసిరిన సవాల్ ను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ స్థాయి వ్యాక్సిన్ సేకరణ కసరత్తులో భారత్ భాగస్వామ్యం అవుతోందని విదేశాంగకార్యదర్శి హర్ష్ వీ ష్రింగ్లా పేర్కొన్నారు. జీ7, జీ20, క్వాడ్, బ్రిక్స్,ఐక్యరాజ్యసమితి, డబ్ల్యూహెచ్ఓలతో చర్చలు జరుపుతున్నా మని చెప్పారు.ఇక వ్యాక్సిన్‌కొరత నేపథ్యంలోవిదేశీ వ్యాక్సిన్ కంపెనీలకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు హోంమంత్రిత్వ శాఖ సంసిద్ధత వ్యక్తం చేసింది.

# 231 మంది వార్డు హెల్త్ సెక్రటరీ గ్రేడ్-3 లా సర్వీస్ రిజిస్టర్ ఓపెన్ చేయాలి

## జిల్లా ఎన్జీవో నాయకుల డిమాండ్

నెల్లూరు 231 వార్డు హెల్త్ సెక్రటరీ గ్రేడ్ 3 లకు చెందిన సర్వీస్ రిజిస్టర్ లను ఓపెన్ చేయాలని డి ఎం హెచ్ ఓ కు జిల్లా ఎన్జీవో నాయకులు శుక్రవారం విన్నవించారు. రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఏపీ యన్ జీ ఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా శాఖ తరపున జిల్లా కార్యదర్శి నందిమండలం, ఆంజనేయ వర్మ ఆద్వర్యంలో శుక్రవారం నెల్లూరు జిల్లా లోని గ్రామీణ ప్రాంతాల్లో గల సచివాలయంలో విధులు నిర్వర్తించుచున్న (మూడవ మహిళా ఆరోగ్య కార్యకర్తలకు) వార్డు హెల్త్ సెక్రెటరీ (గ్రేడ్ ఎఎ) సర్వీసు రిజిస్టర్ ఓపెన్ చేశారు, ఈ సందర్భంగా జిల్లా ఎన్జీవో సంఘ నాయకులు మాట్లాడుతూ నెల్లూరు నగర కార్పొరేషన్, అదేవిధంగా నెల్లూరు జిల్లా లో గల కావలి, గూడూరు ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం,వెంకటగిరి మొదలగు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో పనిచేయుచున్న (మూడవ మహిళా ఆరోగ్య కార్యకర్తలు) వార్డు హెల్త్ సెక్రెటరీ (గ్రేడ్ ఎఎ) షుమారు 231 మందికి సర్వీసు రిజిస్టర్ ఓపెన్ చేయాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా యస్.రాజ్యలక్ష్మి ని యన్ జీ ఓ నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సమస్య పై సానుకూలంగా స్పందించిన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి సంబదిత అధికారి డా సతీష్ హరిశ్చంద్రని పిలిచి ఎస్ ఆర్ (సర్వీసు రిజిస్టర్లు) ఓపెన్ చేసే విధంగా మౌఖికంగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మన్నేపల్లి. పెంచలరావు, జిల్లా కోశాధికారి బండారుపల్లి.వెంకటేశ్వర్లు,నెల్లూరు నగర ఉపాధ్యక్షుడు శ్యాంసన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కోర్ట్ ఆదేశాలు దిక్కరించిన గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పై చర్యలు తెసుకోవాలి

గుంటూరు జూన్ 4 హైకోర్ట్ ఆదేశాలు దిక్కరిస్తూ నిరుపేదలను వేదింపులకు గురి చేస్తున్న గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్, గురిజాల ఆర్డిఓ, స్తానిక ఎంఎల్ఏ, తహసీల్ దార్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎన్పిపి రాష్ట్ర కార్యదర్శి పి.సత్యం రాష్ట్ర ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేసారు. వెల్దుర్తి మండలం గొట్టిపాళ్ళ గ్రామం లో గత 20 సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్న సుమారు 200 మంది ఎస్సి,ఎస్టి,చెంచు వర్గాలకు చెందినా నిరుపేదలు సర్వే నంబర్ 373-1లో గల 350 ఎకరాల స్థలం లో పొలం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అప్పట్లో ఇట్టి భూమి అటవీ శాఖదని, కాదు రెవెన్యు వారిదంటు వారిని వెళ్లగొట్టే ప్రయత్నం చేయగా బాదితులు హైకోర్ట్ ను ఆశ్రయించారని తెలిపారు.కేసు పూర్వాపరాలు పరిశీలించిన హైకోర్ట్ ఇట్టి భూమి నిరుపెదలకే చెందుతుందని పేర్కొనడం జరిగిందని సత్యం వివరించారు. టిడిపి ప్రభుత్వం పోయి వైసిపి ప్రభుత్వం వచ్చినా పేదలపై వేదింపులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.లక్షల రూపాయల విలువచేసే ఇట్టి భూమిపై కన్నేసిన స్థానిక ఎంఎల్ఏ పి.రామ కృష్ణ రెడ్డి అతని అనుచరులు గుంటూరు జిల్లా జాయింట్ కలక్టర్ తో కుమ్మక్కయి మీకు ఈ భూమి ఎవరిచ్చారు ఏలావచ్చిందంటు బాదితుల ఇళ్ళలోకి వెళ్లి పోలిసులమంటూ, మహిలలంటూ చూడకుండా కోర్ట్ ఆదేషాలు దిక్కరించి నానా భీవస్సమ్ సృష్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీరి బెదిరింపులు, ఆగడాలకు భయపడి కొందరు భూమిని వదిలేసి వెళ్ళారని, మిగిలిన వారి ఇళ్ళకు ఇట్టి భూమి రెవెన్యు శాఖది అంటూ,అటవీ శాఖదంటు విఆర్ఓ, తహసిల్ దారులు దూరంగా ఉండి వైసిపి కార్యకర్తల లచే నోటిసులు అంటించడం ప్రభుత్వం అధికారుల అలసత్వానికి నిదర్శన మన్నారు.దీని పై ముఖ్య మంత్రి వెంటనే స్పందించాలని లేని పక్షలం లో హైకోర్ట్ ఆదేశాలను దిక్కరన క్రింద కేంద్ర డిఓపిటి కి జిల్లా జాఏంట్ కలెక్టర్ , ఆర్డిఓ ,స్తానిక ఎంఆర్ఓ లపై పిర్యాదు చేయనున్నట్లు సత్యం తెలిపారు.

# ఫర్టీలైజర్ దుకాణాలకు కర్ఫ్యూ మినహాయింపు ఇవ్వాలి

ఎమ్మిగనూరు ఫర్టీలైజర్ దుకాణాలకు కర్ఫ్యూ మినహాయింపు ఇవ్వాలని ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం(పి.డి.ఎస్.యు) జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు,ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) తాలూకా నాయకులు నరసింహ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం లో ఎంఆర్ఓ జయన్న గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కారణంగా రాష్ట్ర ప్రభుత్వం విధించిన కర్ఫ్యూ 12 గంటలకె ఎరువుల దుకాణాలు మూసేవేయడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.గత వారం రోజులనుండి కురుస్తున్న వర్శ్యలు కారణంగా రైతులు పంటలు వేసుకోవడానికి విత్తనాలు,ఎరువులు అందుబాటులో లేకపోవడం వలన చాలా అవస్తాలు పడుతున్నారని అన్నారు.కర్ఫ్యూ ను అలుసుగా తీసుకొని ఫర్టీలైజర్ యాజమాన్యం బ్లాక్ లో రైతుల నడ్డి వీరేచే విదంగా విత్తనాలు, ఎరువులు అధిక దారులకు అమ్ముతూన్నారని అన్నారు.కాబట్టి ఉన్నతి అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ఫర్టీలైజర్ దుకాణాలకు కర్ఫ్యూ మినహాయింపు సమయం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు ఆషిఫ్, ఏసేపు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# బరువు తగ్గడానికి అరగంట సైక్లింగ్ సరిపోతుందా? ఇంకా ఎక్కువ సమయం తొక్కాలా?



ఇప్పుడు చాలా మంది సైక్లింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. కారణం ఊబకాయం వదిలించుకోవడమే. మారిన జీవనశైలి మరియు ఆహారపు అలవాట్లు మన శరీరాన్ని చాలా ప్రభావితం చేస్తాయి. సంతృప్త, కొవ్వు మరియు ఫాస్ట్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల మన శరీరంలో కొవ్వు శాతం పెరుగుతుంది, ఫలితంగా బరువు పెరుగుతున్నారు.కొవ్వును అదుపులో ఉంచడానికి వ్యాయామం సహాయపడుతుంది, కాని కొంతమంది వ్యాయామం పట్ల నిర్లక్ష్యంగా ఉండవచ్చు. సైక్లింగ్ మనసుకు ఆహ్లాదకరంగా ఉంటుంది, కాళ్ళకు మంచి వ్యాయామం మరియు తక్కువ ఊబకాయం కూడా ఉంటుంది సైక్లింగ్ హబ్ ఒకే వైపు వ్యాయామం చేయవలసిన అవసరం లేదు. బయట ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి, ఇంటికి పాలు, న్యూస్ పేపర్, కూరగాయలు మొదలైనవి తీసుకురావడానికి ఇది మీకు సహాయపడుతుంది. ఈ పనులకు సైకిల్ తొక్కడం వల్ల శరీరం చాలా ఫ్లెక్సిబుల్ గా ఉంటుంది.ఇటీవల, కొన్ని నగరాలు ఆరోగ్య సమస్యల కారణంగా సైకిల్ మరియు కార్ సైకిల్ కార్యాలయానికి వెళ్లడం ప్రారంభించాయి.సైకిళ్ళు వాడటం ఆరోగ్యాన్ని తీసుకురావడమే కాక పర్యావరణ కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుంది. జూన్ 3. ప్రపంచ సైకిల్ దినోత్సవం. సైక్లింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ముఖ్యంగా రోజు శరీరంలో కొవ్వు పెరగకుండా కంట్రోల్ చేయడానికి బరువు తగ్గడానికి అరగంట సైక్లింగ్ సరిపోతుందా లేదా అనే సమాచారం కోసం ఈ వ్యాసంలో చూడండి.అసలు ఏమీ చేయకపోవడం కంటేఆంగ్లంలో ఒక నానుడి ఉంది. అసలు ఏమీ చేయకపోవడం కంటే , మెరుగైనది ఏదో ఒకటి కొంచెం చేసినా మంచిది. ఉదయం నడక లేదు, వ్యాయామం లేదు, వ్యాయామం లేదు, యోగా లేదు, శారీరక శ్రమ లేదు.ఇలా అయితే ఆరోగ్యం ఏమౌతుంది.ఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి మరియు నీరు తాగితే; శరీరంలో అద్భుతం జరుగుతుందిఉదయం ఖాళీ కడుపుతో వెల్లుల్లి మరియు నీరు తాగితే; శరీరంలో అద్భుతం జరుగుతుందికొంచెం ఎక్కువ సేపు సైకిల్ తొక్కడం మంచిది కాదా?మీరు ప్రతిరోజూ 30 నిమిషాలు సైకిల్ తొక్కితే, ఆరోగ్యంగా ఉండటానికి మీరు మరేమీ చేయక్కర లేదు, కానీ మీరు ప్రతిరోజూ దీన్ని చేయాలి.ప్రతిరోజూ 30 నిమిషాలు సైక్లింగ్ చేయడం వల్ల స్థూలకాయంగా తగ్గించడానికి, ఆరోగ్యంగా ఉండటానికి, శరీర ఆరోగ్యం మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి సరిపోదు. పాల దినోత్సవం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయాలివే...!మీరు ఎక్కువ సేపు సైకిల్ తొక్కితే ఏమి జరుగుతుంది?కొంత మంది అరగంట సైకిల్ తొక్కడానికి బదులుగా ఎక్కువ సేపు తొక్కి త్వరగా బరువు తగ్గొచ్చు , సన్నబడవచ్చు ఆలోచనతో ఒక గంట, రెండుగంటల సేపు సైకిల్ తొక్కుతారు. అలా చేయడం మంచిది పద్ధతి కాదు. ఎందుకంటే ఎక్కువ సేపు సైకిల్ తొక్కడం వల్ల కండరాలకు గాయం అవుతాయి.ధూమపానం చేసేవారికి కరోనాతో చనిపోయే ప్రమాదం 50 శాతం ఎక్కువ...ధూమపానం చేసేవారికి కరోనాతో చనిపోయే ప్రమాదం 50 శాతం ఎక్కువ...సైక్లింగ్ యొక్క ఇతర ప్రయోజనాలు బరువు తగ్గడం× ఆకలిని నియంత్రిస్తుంది× రాత్రి బాగా నిద్రపొందుతారు (నిద్రపోలేని వారికి సైక్లింగ్)× శరీర రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుతుంది.× కొలెస్ట్రాల్ తగ్గుతుంది× రక్తపోటును నియంత్రిస్తుంది× కండరాలు బలపడతాయి× సోమరితనం దూరం అవుతుంది.సైక్లింగ్ వల్ల ఉత్తమ ఫలితాలను పొందడానికి ఎంత సమయం పట్టవచ్చు?× ఫస్ట్ రైడ్: ఫస్ట్ రైడ్‌లో, మీరు కొద్దిగా అడవి ప్రాంతానికి వెళితే, కాళ్లలో కొంత వ్యాయామం చేస్తే బాగుంటుంది.× కొన్ని వారాల తరువాత: మీరు సైక్లింగ్ ప్రారంభించినప్పుడు మీ గుండె మరియు రక్త నాళాలు మరింత పనిచేయడం ప్రారంభిస్తాయి. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే, రక్తంలో చక్కెర నియంత్రించబడుతుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది.× నెలల తరువాత: మీరు ఎత్తైన కొండ, కొండపై ఎటువంటి అలసట లేకుండా ఎక్కవచ్చు, మీరు రోజంతా చాలా చురుకుగా ఉంటారు, మీరు గతంలో మరియు ఇప్పుడు ఉన్నదానికి చాలా భిన్నంగా భావిస్తారు.× కొన్ని నెలల తరువాత: శరీరంలో కొంచెం మార్పులు, మీ బరువు తక్కువగా కనబడుతారు, కాళ్ల కండరాలు బిగుతుగా ఉంటాయి

## ఐసీసీ ఈవెంట్లు ఇద్దరికి కలిసి రాలేదు

లండన్: జూన్ 18 నుంచి 22 వరకు భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న ప్రపంచటెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌పైనే ఇప్పుడు అందరి కళ్లు నెలకొని ఉన్నాయి. తొలిసారి టెస్టు క్రికెట్ చరిత్రలో చాంపియన్‌షిప్ ఫైనల్ జరగనుండడంతో ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఫైనల్లో తలపడుతున్న కివీస్, టీమిండియాలలో ఎవరు ఫేవరెట్ అనే దానిపై ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. వాస్తవానికి ఈ రెండు బలంగా కనిపిస్తున్నా.. క్రిటిక్స్, మాజీ ఆటగాళ్ల దృష్టిలో ఎవరు ఒకరు మాత్రమే ఫేవరెట్‌గా ఉంటారు. అందులో చాలా మంది టీమిండియానే ఫేవరెట్ అని భావిస్తుంటే.. ఆసీస్ మాజీ స్పీడస్టర్ బ్రెట్ లీ మాత్రం కివీస్‌కు ఎక్కువ అడ్వాంటేజ్ ఉందని అభిప్రాయపడ్డాడు.ఐసీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బ్రెట్ లీ ఈ వ్యాఖ్యలు చేశాడు.” ఇంగ్లండ్ పిచ్‌లు కివీస్‌కు సరిపోతాయి. ఎందుకంటే ఇక్కడి పిచ్‌పై వారు బ్యాటింగ్ చేస్తుంటే అది వారి సొంత గ్రౌండ్‌లో ఆడినట్టుగా ఉంటుంది. ఈ ఫైనల్లో బౌలింగ్ కీలకంగా మారనుంది. వికెట్ గురించి మాట్లాడేటప్పుడు బౌలింగ్‌కు సహకరిస్తుందా లేదా అనేది కీలకం. స్పిన్.. స్వింగ్ నుంచి ఫాస్ట్ బౌలింగ్ ఇలా ఏ అంశం చూసుకున్నా కివీస్‌కు అడ్వాంటేజ్ కనిపిస్తుంది.

# విప్లవ భావాలకు భావోద్వేగాలు కలబోసిన 'అర్ధ శతాబ్దం'




'కేరాఫ్ కంచెరపాలెం' ఫేమ్ కార్తిక్ రత్నం - నవీన్ చంద్ర ప్రధాన పాత్రలలుగా తెరకెక్కిన తాజా చిత్రం “అర్ధ శతాబ్దం”. 'ది డెమొక్రటిక్ వైలెన్స్' అనేది దీనికి ఉపశీర్షిక. రవీంద్ర పుల్లే ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ - టీజర్ సినిమాపై ఆసక్తిని కలిగించాయి. తెలుగు ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ 'ఆహా' లో ఈ సినిమా జూన్ 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది.'ఈ విశాల సృష్టిలో మనిషి కన్నా ముందు ఎన్నో జీవరాశులుండేవి. ఒకానొక రాక్షస గడియలో మానవ జాతి పుట్టుక సంభవించింది' అనే వాయిస్ ఓవర్ తో ఈ ట్రైలర్ ప్రారంభమైంది. పుష్ప అనే అగ్ర కులానికి చెందిన అమ్మాయి ప్రేమ కోసం కృష్ణ అనే నిమ్న వర్గానికి చెందిన అబ్బాయి పడే తపనని ఇందులో చూపించారు. పరువు కోసం రెండు వర్గాల మధ్య సాగే కథలాగా కనిపిస్తున్నప్పటికీ.. దీనికి విప్లవం - అభ్యుదయ భావాలు కలబోసి చూపించబోతున్నారు. అంతేకాదు ఓ గులాబీ పువ్వు కోసం రెండు వర్గాలు కొట్టుకుంటున్నట్లు ట్రైలర్ లో ప్రస్తావించడం ఆసక్తిని కలిగిస్తోంది.'మన పక్కన ఉండేవాడు మన కులం కాకపోయినా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ మన అమ్మాయి పక్కలో ఉండేవాడు మనవాడే అయ్యుండాలి' 'ఈ యాభై ఏళ్ల స్వాతంత్ర్యం దేని కోసమో ఎవరి కోసమో ఇప్పటి దాకా అర్థం కాలేదు' వంటి డైలాగ్స్ సినిమా నేపథ్యాన్ని తెలియజేస్తున్నాయి. ఈ చిత్రంలో నవీన్ చంద్ర పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా.. సాయి కుమార్ - అజయ్ - శుభలేఖ సుధాకర్ - ఆమని - రాజా రవీంద్ర ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తున్నారు. హీరోయిన్ కృష్ణ ప్రియ - కార్తీక్ రత్నం లకు మంచి పాత్రలు లభించినట్లు తెలుస్తోంది. కృష్ణ - పుష్ప ల ప్రేమ న్యాయాన్ని గెలిపిస్తుందా? లేక యుద్ధాన్ని సృష్టిస్తుందా? అనేది తెలియాలంటే జూన్ 11వ తేదీ వరకు ఆగాల్సిందే.

”అర్ధ శతాబ్దం” చిత్రానికి నౌఫల్ రాజా(ఎ.ఐ.ఎస్) సంగీతం సమకూర్చారు. అష్కర్ - వెంకట్ ఆర్ - ఈజే వేణు సినిమాటోగ్రాఫర్స్ గా వ్యవహరించారు. జె. ప్రతాప్ కుమార్ ఎడిటింగ్ వర్క్ చేశారు. భావోద్వేగాలు కలబోసిన ఈ ట్రైలర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. మరి సినిమా ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. వీర్ ధార్మిక్ సమర్పణలో రిషిత శ్రీ క్రియేషన్స్ మరియు 24 ఫ్రేమ్స్ సెల్యూలాయిడ్ పతకాలపై చిట్టి కిరణ్ రామోజు - రాధాకృష్ణ.టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




# కుర్రహీరోయిన్ కోరిక బాగానే ఉందిగా..!



సినీ ఇండస్ట్రీలో మల్టీ టాలెంటెడ్ హీరోయిన్స్ చాలామంది ఉన్నారు. వారిలో కొందరు యాక్టింగ్ తో పాటు సింగింగ్ - మ్యూజిక్ డైరెక్షన్ - పెయింటింగ్ - ఫోటోగ్రఫీ ఇలా ఒక్కొక్కరు ఒక్కో అదనపు టాలెంట్ బయట పెడుతుంటారు. తాను కూడా అదేబాటలో వెళ్తాను అంటోంది యంగ్ హీరోయిన్ నివేదా థామస్. నివేదా గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా కుర్రకారు ఫేవరేట్ హీరోయిన్స్ లిస్టులో అమ్మడి పేరు ఖచ్చితంగా ఉంటుంది. అయితే తమిళనాడులో పుట్టిపెరిగిన నివేదా విద్యాభ్యాసం మొత్తం అక్కడే పూర్తిచేసింది. 2016లో 'జెంటిల్ మెన్' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన నివేదా.. ఫస్ట్ సినిమాతోనే మంచి హిట్ అందుకుంది.మొదటి సినిమా హిట్ అవ్వడంతో అవకాశాలు చేజిక్కించుకొని తనకు సూట్ అయ్యే క్యారెక్టర్స్ మాత్రమే ఎంపిక చేసుకుంటుంది అమ్మడు. ఆ విధంగా నిన్నుకోరి జైలవకుశ సినిమాలతో పాటు 118 బ్రోచేవారెవరురా దర్బార్ సినిమాలతో మంచిహిట్స్ ఖాతాలో వేసుకుంది. కానీ ఇప్పటికి సాలిడ్ సినిమాలతో బిజీ హీరోయిన్స్ లిస్టులో మాత్రం చేరలేకపోతుంది నివేదా. గతేడాది నాని సుధీర్ బాబులతో కలిసి వి సినిమాలో నటించింది. భారీ అంచనాలతో విడుదలైన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పరవాలేదు అనిపించుకుంది. అలాగే అవకాశాలు కూడా పెద్దగా తేలేకపోయింది. ఇటీవలే నివేదా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రీ-ఎంట్రీ చేసినటువంటి బ్లాక్ బస్టర్ 'వకీల్ సాబ్' సినిమాలో కీలకపాత్ర పోషించింది.ఏప్రిల్ 9న థియేట్రికల్ రిలీజ్ అయినటువంటి వకీల్ సాబ్ నివేదాకు మంచి పేరు తీసుకొచ్చిందట. వకీల్ సాబ్ మూవీ పై నివేదా చాలా ఆశలే పెట్టుకుందట. కానీ లీడ్ హీరోయిన్ క్యారెక్టర్ మాత్రం కాదు. ప్రస్తుతం నివేదాకు సోలో హీరోయిన్ గా సాలిడ్ హిట్ అవసరం. అందుకే అమ్మడు మాంచి సూపర్ హిట్ కోసం వెయిట్ చేస్తోంది. అసలే నివేదా గ్లామర్ పరంగా హద్దులు పెట్టుకుంది. మరోవైపు వేరే కుర్రహీరోయిన్స్ గ్లామర్ విషయంలో హద్దులు లేకుండా చెలరేగిపోతున్నారు. ఇలాంటి తరుణంలో నివేదా సర్ప్రైజ్ న్యూస్ చెప్పింది. అమ్మడు హీరోయిన్ గా కాకుండా డైరెక్టర్ కావాలని ఉందంటూ చెప్పి షాకిచ్చింది. ఎందుకంటే నివేదా చైల్డ్ ఆర్టిస్ట్ నుండి ఇండస్ట్రీలో కంటిన్యూ అవుతోంది. అలాగే డైరెక్షన్ కోర్స్ కూడా చేసిందట. అందుకే కొన్నాళ్ళు హీరోయిన్ గా చేసాక షార్ట్ ఫిలిమ్స్ ద్వారా డైరెక్షన్ ప్రూవ్ చేసుకుంటానని అంటోందట. చూడాలి మరి నివేదా డైరెక్టర్ గా ఎప్పుడు అవుతుందో!

# సినీకార్మికులకు 'రాకీ భాయ్' భారీ సహాయం..!

ప్రస్తుతం కరోనా పేరు చెబితేనే దేశం చిగురుటాకులా వణుకుతుంది. ఈ మహమ్మారి దేశ ఆర్థిక వ్యవస్థ పై భారీ ప్రభావం చూపింది. ఇప్పటికే ప్రభుత్వాలు అమలు పరిచిన లాక్డౌన్ నిబంధన మేరకు.. దేశంలో అన్ని వ్యాపారాలు - పనులు ఎక్కడిక్కడ స్థంభించి జనాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కరోనా మహమ్మారి పై పోరాటంలో ఎంతో మంది వైద్యులు పగలు రాత్రి అనే తేడా లేకుండా తమ శక్తి మించి పనిచేస్తున్నారనే చెప్పాలి. మనదేశంలో ప్రస్తుతం కరోనా వైరస్ కట్టడికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోరుగా చర్యలు చేపడుతున్నాయి. ఈ పోరాటంలో ప్రభుత్వాలకు తమ వంతు సాయం అందిస్తున్నారు సినీ తారలు.దేశంలోని అన్ని సినీ పరిశ్రమల నుంచి ఎంతో మంది సెలబ్రిటీలు తమ వంతుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విరాళాలు అందజేశారు. జనాభా మొత్తం వారి వారి ఇళ్లల్లో కూరుకుపోయింది. ఈ పరిస్థితులలో సినీ ఇండస్ట్రీ సెలబ్రిటీల కంటే సినీ ఇండస్ట్రీలో పనిచేసే కార్మికులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో పనిచేసే కార్మికులను పేద కళాకారులకు సెలబ్రిటీలు కూడా చేయూతను అందిస్తున్నారు. ఇండస్ట్రీలో రోజువారీ కూలి పనిచేసే కార్మికులను దృష్టిలో పెట్టుకొని మెల్లగా సెలబ్రిటీలు విరాళాలు ఇవ్వడానికి కదిలి వస్తున్నారు. తాజాగా కన్నడ స్టార్ హీరో యష్ కోటిన్నర రూపాయలు కన్నడ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు విరాళంగా అందిస్తున్నాడు.ఇండస్ట్రీలో పని చేస్తూ డైలీ పూట గడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న మూడు వేలమంది కార్మికులకు వారి అకౌంట్స్ లో ఒక్కొక్కరికి 5వేలు జమచేయనున్నట్లు తెలిపాడు. తన తరపున ఇండస్ట్రీకి సోదరభావంతో విరాళం అందిస్తున్నట్లు యష్ చెప్పుకొచ్చాడు. ఇలాంటి కష్టమైన సమయంలో అందరు ధైర్యంగా ఉండాలని పేర్కొన్నాడు. ప్రస్తుతం హీరో యష్ ను ఇండస్ట్రీతో పాటు అభిమానులు కొనియాడుతున్నారు. ఇదిలా ఉండగా.. యష్ ప్రస్తుతం బ్లాక్ బస్టర్ కేజీఎఫ్ సీక్వెల్ లో నటించాడు. పాన్ ఇండియా మూవీగా కేజీఎఫ్-2 ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను విజయ్ కిరగందుర్ నిర్మిస్తున్నాడు. శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికి ఈ సినిమా టీజర్ సినిమా పై అంచనాలు రెట్టింపు చేసింది. చూడాలి మరి ఎప్పుడు రిలీజ్ కాబోతుందో..!

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190